ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శుక్రవారం ।14 నవంబర్ 2025 । ■ 16 పేజీలు


5

## శ్రావణి కుటుంబానికి అండగా ఉంటాం

■ కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ■ మొదటి విడతగా రూ.4.12 లక్షల మంజూరు అందజేత


15

# రైస్ మిల్లర్ల మాయాజాలం..!

■ సీఎంఆర్ ధాన్యంలో రైస్ మిల్లుల గోల్ మాల్
■ నిర్మల్ జిల్లాలో 2684 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం పక్కదారి
■ రూ.6.22 కోట్ల ధాన్యం మాయం ■ వేలాది టన్నుల వడ్లనూ అమ్మేశారు..
■ కడెం ప్రాంతంలో భారీగా సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్ళించిన మిల్లర్లు
■ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో అక్రమాలు వెలుగులోకి
■ కట్టా బాలాజీ రైస్ మిల్లులో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక సోదాలు
■ సదరు మిల్లు యజమానిపై చర్యలకు పౌరసరఫరాల శాఖకు నివేదిక..
■ సర్కార్‌కు ఓ ప్రజాప్రతినిధి ఫిర్యాదు ■ నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లలో కలకలం

ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రత్యేక ప్రతినిధి

పేదలు కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం డీలర్ల నుంచి దళారులు, మిల్లర్లు, వ్యాపారుల జేబులు నింపుతోంది. రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తూ ఏటా కోట్లాది రూపాయిలు దోచుకుంటున్నారు. ప్రజలకు చేరాల్సిన బియ్యం దొడ్డిదారిలో మిల్లులకు చేర్చి అక్కడ పాలిష్ పట్టించి వివిధ రకాల బ్రాండ్ల పేరుతో మార్కెట్లో విక్రయిస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్నే పాలిష్ పెట్టి సీఎంఆర్‌కు సరఫరా చేస్తూ ప్రభుత్వానికే టోకరా వేస్తున్నారు. అధికార యంత్రాంగం సహకారంతో జరుగుతున్న ఈ అక్రమ దందాకు నిర్మల్ జిల్లా వేదికగా మారింది. తాజా గురువారం జిల్లాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల చేపట్టిన ఆకస్మిక దాడులతో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయల విలువ చేసే సీఎంఆర్ ధాన్యాన్ని దారిమళ్లించినట్లు అధికారులు గుర్తించారు. నిర్మల్ జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో ధాన్యం బస్తాలు మాయం అయినట్లు గుర్తించారు. నిర్మల్ జిల్లా కడెం ప్రాంతంలో రైస్ మిల్లర్లు భారీగా సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్ళించారనే విశ్వసనీయ సమాచారం అందడంతో కరీంనగర్ విజిలెన్స్ యూనిట్ ఈ నెల 11వ తేదీన కట్టాబాలాజీ రైస్ మిల్‌లో సోదాలు నిర్వహించగా ఇందులో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 2684 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం స్టాక్ దారి మళ్లించారని దీని విలువ 6.22 కోట్లు ఉంటుందని గుర్తించారు.



## ప్రభాత సమాచారం ఎడిటర్‌కు అభినందన

ఉట్నూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక ఎడిటర్ సయ్యద్ కరీం జిల్లా స్థాయిలో కలెక్టర్‌చే ఆధ్వర్యంలో సన్మానం జరిగిన సన్మానం అందుకున్న నేపథ్యంలో గురువారం ఉట్నూరులో వారి నివాసంలో సయ్యద్ కరీం ను కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఉట్నూర్ ప్రాంతంలో ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ జిల్లాస్థాయిలో ప్రశంసలు అందుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ప్రభాత సమాచారం పత్రికలో ప్రజల సమస్యలను పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తూ పత్రిక రంగంలో గత 40 సంవత్సరాలుగా చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఆర్టిఏ మెంబర్ దూట రాజేశ్వర్, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంత్ రావు, కాంగ్రెస్ నాయకులు బిరుదుల లాజర్, సయ్యద్ నిసార్, కొత్తపల్లి మహేందర్ రాజేష్ జాదవ్ అబ్దుల్ ఫహీం పాల్గొన్నారు.

## గజగజ

■ రానున్న మూడు, నాలుగు రోజులు పెరగనున్న చలి తీవ్రత
■ 8.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం
■ సిర్పూర్(యూ)లో 10.2 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు
■ ఆదిలాబాద్, నిర్మల్,కుమ్రంభీం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
■ చలితీవ్రతతో అప్రమత్తంగా ఉండాలని సూచన





16

## ప్రతీ నీటి బిందువు అమూల్యం

■ ప్రతి బొట్టును పొదుపుగా వాడుకుందాం
■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
■ ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ..
■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
■ ఉట్నూర్‌లో మన బడి-మన నీరు
■ జెడ్పీలో అధికారులతో సమీక్ష

ప్రతీ నీటి బిందువు అమూల్యమని, ప్రజల భాగస్వామ్యంతోనే స్థిరమైన నీటి వనరుల సంరక్షణ సాధ్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా నిర్వ హించిన 'మన బడి-మన నీరు' కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ కూడలి నుండి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జెండా ఊపి ప్రారంభించారు.




నేటి బాలలే రేపటి పౌరులు, దేశ భవితవ్యం బాలల పైనే ఆధారపడి ఉంది. బాలలు సక్రమమైన దారిలో నడిస్తేనే దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు, గ్రామానికి మంచి పేరు, ప్రతిష్టలు, కీర్తిలభిస్తాయి.

జొన్న, రాగిసంకటి పేదోడి ఆహారం. కొర్రలు, ఊదలు, అరికెలు వంటి సిరిధాన్యాలు పేదోళ్ల ఇళ్లలోనే వండేవారు. కాయకష్టం చేసేవారికి ఇదే బలవర్ధకమైన ఆహారం. ప్రస్తుతం పరిస్థితి మారింది. షుగర్ కాలాన్ని తిరగేస్తోంది. నేడు వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా కథనం.





## ఏకాగ్రతతో చదివి సమాజానికి
# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- విలువలతో కూడిన వైద్య సేవలు అందించాలని
- విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు
- డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదనుగుణంగా



విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పీడియాట్రీషియన్, అనస్తీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2047 రైసింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా దేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు 2047 నాటికి పూర్తవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



- క్రీడలతో ఉపాధి అవకాశాలు
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలి
- క్రీడల్లో గెలుపు, ఓటములు అనేవి సహజం
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

క్రీడా రంగంలో రాణించడం ద్వారా అనేక ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం స్థానిక న్యూ హౌసింగ్ బోర్డులోని మహాత్మా జ్యోతి బాపులే పాఠశాల, కళాశాలలో జరిగిన క్రీడా వార్షిక ముగింపు వేడుకల్లో పాల్గొని, కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపాలని సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి క్రీడా విశ్వవిద్యాలయం ప్రారంభమవుతోందని, అదిలాబాద్, జాతర్ల, ఉట్నూర్‌లలో ఇప్పటికే క్రీడా పాఠశాలలు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. అలాగే ఐఐటి, నీట్, జెఈఈ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రత్యేకంగా కోచింగ్ అందుబాటులో ఉందని తెలిపారు.



అదనంగా, వసతి గృహాల్లో మెనూ, కాస్మోటిక్ చార్జీలను పెంచినట్టు కలెక్టర్ వివరించారు. వృద్ధులను ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో ఉంచకుండా గౌరవంగా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడల్లో ఓడిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా, వచ్చే పోటీల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్ పాల్గొన్నారు.



# ఖానాపూర్‌లో గంజాయి ముఠా అరెస్ట్

## మూడు కిలోల గంజాయిని స్వాధీనం
## ఇద్దరు నిందితుల అరెస్టు


**ఖానాపూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ పట్టణంలోని సుభాష్‌నగర్, గాంధీనగర్ కాలనీకి చెందిన కొంతమంది వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నారని సమాచారాన్ని అందుకున్న ఖానాపూర్ పోలీసులు మాటు వేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసినట్టు ఖానాపూర్ పోలీసులు తెలిపారు. ఖానాపూర్ సిఐ సిహెచ్ అజయ్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖానాపూర్ మండలంలోని సదర్ మార్ట్ ఆయకట్టు కాలువ సమీపంలో నిషేధిత గంజాయి విక్రయాలు జరుగుతుండగా ఖానాపూర్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులను గురువారం అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ చెందిన బోదాసు రాము గాంధీనగర్ కాలనీకి చెందిన పుట్ట మనోహర్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారంతో వారిద్దరిని పట్టుకున్నట్లు సిఐ తెలిపారు వారి వద్ద నుంచి సుమారు మూడు కిలోల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకుందామని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు ఈ కేసులో మరో నిందితుడు ఉన్నాడని అతని కూడా అదుపులోకి తీసుకుంటామని సీఐ వెల్లడించారు. నిషేధిత గంజాయి విక్రయాలు కానీ వాటిని ప్రోత్సహించిన వారు ఎంతటి వారైనా కఠినమైన చర్యలు తీసుకుంటామని సిఐ వెల్లడించారు విద్యార్థులు గంజాయికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు గంజాయి పండించినట్లు లేదా విక్రయించినట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐ సిహెచ్ అజయ్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎస్ఐ జ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ పాఠశాలల్లో ఇంకుడు
# గుంతలు నిర్మించుకోవాలి
## బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం నిర్వహించిన 'మనబడి-మన నీరు' కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో, ప్రతి పల్లెల్లో, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. నీటిని ఒడిసి పెట్టుకుంటేనే భవిష్యత్తులో మంచి ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం నాడు కేసీఆర్ నాయకత్వంలో మొదలు పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



# పోలీసులపై తప్పుడు ప్రచారం చేయవద్దు

- సోషల్ మీడియాలో పోస్టులపై పోలీసుల హెచ్చరిక
- ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి
- పోలీసు ప్రతిష్టను కించపరిచేలా తప్పుడు ప్రచారం
- ప్రజలు పోలీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి
- నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్..

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు దిగంబర్ కాంబ్లేను అదుపులో తీసుకునే విషయంలో న్యాయవాదులపై పోలీసులు దాడి చేశారని ఆరోపించడం సరికాదని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. న్యాయవాదులు పోలీసులు రౌడీలుగా వివరిస్తున్నారని తమపైన దురుసుగా ప్రవర్తించారని అందుకు సంబంధించిన వీడియోలు తమ వద్ద ఉన్నాయని ఆయన తెలిపారు. అక్కడ జరిగిన విషయాలను ఆయన వెల్లడించారు. సభ్య సమాజం తలదించుకునేలా తన మిత్రుడి కూతురు అయిన 14 సంవత్సరాల మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్లు బాలిక, అతని తండ్రి కేసు పెట్టడంతో, తప్పించుకొని తిరుగుతున్న దిగంబర్ కాంబ్లే అనే నేరస్తుడిని నిన్న ఉదయం ఐబీ గెస్ట్ హౌస్ అవతలి వైపు, కోర్టుకి బయట ఆవరణంలో కారులో ఉండగా, పోలీసులు నేరస్తుడిని గమనించి తమతో



రావాలని మర్యాదపూర్వకంగా కోరగా అతను ప్రతిఘటించడంతో పాటు కార్ లోంచి దిగకుండా పోలీసులను ఇబ్బంది పెట్టడంతో పోలీసులు డోర్ ఓపెన్ చేసి దిగంబర్ కాంబ్లేను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఇటువంటి తీవ్ర నేరం చేసిన వ్యక్తిని కస్టడీలోకి తీసుకునే క్రమంలో న్యాయవాదులే పోలీసు వారి విధులను అడ్డుకుంటూ, నేరస్తుడకి సహకరిస్తూ, అదుపులోకి తీసుకుందామని వచ్చిన పోలీసులను అసభ్యకరంగా బూతు మాటలు తిట్టారని ఆయన తెలిపారు. దిగంబర్ కాంబ్లేను కోర్టు లోపలి నుండి లాక్కుని వెళ్లినట్లు పోలీసులపై దుష్ప్రచారం చేస్తూ, విధులు బహిష్కరిస్తాం అని బెదిరింపులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

■ కష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరాలి ■ మంచిర్యాల ఏసీపీ ప్రకాష్



**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

ప్రతి విద్యార్థి కష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరుకోవాలని మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్ కోరారు. జిల్లా షీ టీమ్ ఇంచార్జ్, ఎస్ఐలు ఉషారాణి, హైమ, మంచిర్యాల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, టీ-సేఫ్ యాప్, షీటీమ్‌లపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి వాటితో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురైనప్పుడు, ఈవ్ టీజింగ్ లకు భయపడకుండా వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వేధింపులను నిర్లక్ష్యం చేయకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. చిన్నపిల్లలు శరీర భాగాలపై ఎవరైనా అపరిచితులు అనుచితంగా తాకినప్పుడు లేదా ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించినప్పుడు అది బ్యాడ్ టచ్ అని గ్రహించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని వివరించారు. విద్యార్థినులు, మహిళల భద్రత కోసం యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. షీ టీమ్ సేవలు, వాటి ఉద్దేశాన్ని గురించి వివరిస్తూ, ఎప్పుడూ అందుబాటులో ఉండే రామగుండం షీ టీమ్ నంబర్ (వాట్సప్ 6303923700), మంచిర్యాల షీటీమ్ (8712659385) నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మంచిర్యాల ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను



నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సారూప్య, వైస్ ప్రిన్సిపాల్ సీమ, మహిళా కానిస్టేబుళ్లు జ్యోతి, శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలతో

## అనారోగ్య సమస్యలు

### జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ యశోద

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

బాల్య వివాహాలు చేయడంతో బాలికల్లో అనేక ఆరోగ్య సమస్యలు నెలకొంటాయని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం భాగంగా ప్రత్యేక బాల్య వివాహ అవగాహన సదస్సును స్థానిక సరస్వతి నగర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల గురువారం నిర్వహించారు. విద్యార్థులకు బాల్యవివాహ నిషేధచట్టం, బాల్య వివాహం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక ప్రభావాలపై అవగాహన కల్పించారు. తదనంతరం పాఠశాలలో కిశోరి గ్రూపులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు బాల్య వివాహ చట్టం, ఫోక్సో చట్టం, అలాగే సేఫ్ టచ్ - అన్‌సేఫ్ టచ్ అంశాలపై వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం ప్రతినిధి లావణ్య, సఖి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, సఖీ సిబ్బంది సంఘమిత్ర, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోండి



**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న 9, 10 తరగతి బీసీ ఇబీసీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ వెబ్సైట్లో సంబంధిత ధ్రువీకరణ పత్రంతో ప్రభుత్వం అందించే 4000 ప్రీమెట్రిక్ ఉపకార వితరణ కోసం డిసెంబర్ 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## సీపీఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయండి

**మందమర్రి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పురుడు పూసుకుని నేటికీ 100 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న పార్టీ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాధుని సుదర్శన్, పట్టణ కార్య దర్శి కామెర దుర్గారాజులు కోరారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శత జయంతి ఉత్సవాల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించి వారు మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర ఉద్యమం నుండి మొదలుకొని భారతదేశ వ్యాప్తంగా ప్రజలు, కార్మికవర్గం, భూమి కోసం, భుక్తి కోసం, వీరోచిత పోరాటాలు చేసి కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని వారు గుర్తు చేశారు. భారత ప్రజానీకం కోసం ఎందరో కమ్యూనిస్టుయోధులు ప్రాణ త్యాగం చేసి చరిత్రను సృష్టించారని వారి సేవలను కొనియాడారు. తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటంతో బాంచను దొర అన్న ప్రజలచే బందూకులు పట్టించి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు ఇచ్చిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుంద న్నారు.పార్టీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించు కొని డిసెంబర్ 26న



ఖమ్మం పట్టణంలో 5 లక్షల మంది చే భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. శతజయంతి ఉత్సవాల విజయవంతం కోసం ఈనెల 15 న కొమురం భీం జిల్లా జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు బస్సు జాత నిర్వహిస్తున్నామని,ఈ జాతను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు ప్రారంభిస్తారన్నారు, జాతీయ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, తక్కలపల్లి శ్రీనివాసరావు, కలవేన శంకర్, సింగరేణి విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి సీతా రామయ్యల సారథ్యంలో జరుగుతున్న జాతలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకుడు రాయబారపు వెంకన్న, బండారి రాజేశం, అంతోని దినేష్, జెట్టి మల్లయ్య పాల్గొన్నారు.



## డబ్బులు వసూళ్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల అవినీతి, రోడ్డు విస్తరణలో వ్యాపారుల నుంచి డబ్బుల వసూళ్లు, ప్రభుత్వ భూముల అక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రోడ్డ విస్తరణలో స్థానికుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని గులాబీ శ్రేణులు డిమాండ్ చేశారు. పట్టణంలో కన్నాల ఫ్లైఓవర్ శివారు ప్రభుత్వ భూములతో పాటు ఎక్కడ చూసినా భూ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భూ అక్రమాలు, వ్యాపారుల నుంచి డబ్బుల వసూళ్ల వెనక అధికార పార్టీ లీడర్లే ఉన్నారని ఆరోపించారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టీఆర్ఎస్ ప్రతినిధులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనెటి సత్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నాయకులు మద్దెల గోపి, సబ్బని అరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చేపలు పట్టే సమయంలో

## చేపల పంపిణీ ఏమిటీ..!

**బజార్‌హత్నూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపిన నాయకుడు కేసీఆర్ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని దేగామా చెరువులో చేపపిల్లలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవితాల్లో వెలుగు నింపి రాష్ట్రంలో నీలి విప్లవానికి నాంది పలికి మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు. చేపలు పట్టే సమయంలో చేప పిల్లలు వదలడం ఏమిటి అని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి ఇరవై ఒక్క వేలు విరాళంగా అందజేశారు.



# టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ద్వారా 4వ బ్యాచ్ లో శిక్షణ పొందిన వారికి టాస్క్ మేనేజర్ సాయికుమార్ తో కలిసి ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు టాస్క్ ద్వారా వివిధ కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టాస్క్ 4వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన 35 మందిలో 30 మంది ఆర్యవర్ధన్ కంపెనీలో ఈ - పబ్ ప్రోగ్రామర్లుగా ఎంపికయ్యారని తెలిపారు.. సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసంతో మాట్లాడవచ్చని, కష్టపడే తత్వం ఉండాలని తెలిపారు. ఉపాధిలో నూతన అంశాలను నేర్చుకుంటూ వాటిని అమలు చేస్తూ అభివృద్ధి చెందాలని, చిత్తశుద్ధితో పనిచేసే వారికి అవకాశాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారులు, శిక్షకులు సుధీర్, పూజ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పీఎం ఉజ్వల పథకం ఎంపికైన
# లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఎల్‌పిజి గ్యాస్ లబ్ధిదారుల ఎంపికపై విస్తృత అవగాహన చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి ప్రధానమంత్రి ఉజ్వల పథకం పై పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా, వ్యవసాయ, మత్స్య శాఖల అధికారులు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద పేదవారికి ఉచితంగా ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లు అందిస్తుందని, అర్హులైన వారిని



గుర్తించడంలో సంబంధిత శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన పరచాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యుల ద్వారా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉజ్వల సిలిండర్ అనర్హుల చేతిలో ఉంటే సమగ్ర విచారణ జరిపి తొలగించాలని, ఆదాయం, భూ విస్తీర్ణం, వాహనాలు కలిగిన యజమానుల వివరాలు సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, రవాణా శాఖ అధికారి రామ్ చందర్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, తహసిల్దార్లు, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణిలో జాబ్ నోటిఫికేషన్

**కోల్‌బెల్ట్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
నిరుద్యోగులకు భారీ గుడ్ న్యూస్ తెలిపింది సింగరేణి సంస్థ. 82 ఉద్యోగాలకు సింగరేణి కాలరీస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ ఉద్యోగాలు ఇంటర్నల్ అభ్యర్థులకు మాత్రమేనని పేర్కొంది. సంస్థలో ఇదివరకే పనిచేస్తున్న వారితో ఈ ఎగ్జిక్యూటివ్ క్యాడర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 24లోగా అప్లై చేసుకోవాలని తెలిపింది. దరఖాస్తు హార్డ్ కాపీని ఈనెల 26లోగా సంబంధిత శాఖకు పంపించాల్సి ఉంటుంది. ఎన్నికైన అభ్యర్థులకు బేసిక్ శాలరీ నెలకు రూ.50,000 ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. మిగిలిన వివరాలకు https://scclmines.com/scclnew/index.aspనందు సంప్రదించాలని తెలిపింది.

## మహాలక్ష్మి ఆలయంలో చోరీ

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని బంగల్‌పేట మహాలక్ష్మి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయం కున్న గేట్లను పగలగొట్టి లోపల ఉన్న రెండు హుండీలను ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును దొంగిలించినట్టు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం గుడికి వెళ్లిన ఆలయ పూజారి ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు క్లూస్ టీంతో వచ్చి దర్యాప్తు చేస్తున్నారు.



# బాల్యవిహాలు చేయడం చట్టరీత్యా నేరం

### మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ మౌనిక

**ఖానాపూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
బాల్య వివాహాలు చట్ట రిత్యా నేరమని మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ మౌనిక అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామంలోని ప్రజా పరిషత్ పాఠశాలలో గురువారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి కాకముందు వివాహం చేయకూడదని.. ఒకవేళ అలా చేస్తే చట్టరీత్యా నేరమని ఆమె పేర్కొన్నారు. అనుసంధానం లోని గ్రామంలో బాల్య వివాహం చేసినట్లు తెలిస్తే వెంటనే 1098కి ఫోన్ చేసిన సమాచారం అందించాలని సూచించారు.




సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. తెలిపారు. బాలల హక్కుల రక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుండాలన్నారు. సఖీ సేవలను, చైల్డ్ లైన్ సేవలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, సఖి కౌన్సిలర్ కవిత, సఖి కేసు వర్కర్ లా వణ్య, చైల్డ్ లైన్ కౌన్సిలర్ సుప్రియ, చైర్మన్ నీలా పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి





### ఇంచార్జీ డీఈవో, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. మండలంలోని అంకుశాపూర్ గ్రామ పంచాయతీ తేలిగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ, తరగతి గదులు, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెప్పారు. ఆహారం తయారీ సమయంలో పరిశుభ్రత నిబంధనలు పాటించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ఇండ్లు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్, కార్యదర్శి కవిత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



## విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

**ఇంద్రవెల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఇంటర్ బోర్డ్ రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వరులు అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని లింగూడా గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి కళాశాలలో అందిస్తున్న చదువు, సమస్యలను అడిగే తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని, విద్యార్థులు ప్రతి రోజు తరగతులకు హాజరుకావాలని దిశ నిర్దేశం చేశారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఫిబ్రవరి 2026లో వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇప్పటి నుండే పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడ్డ వ్యక్తులపై
# చర్య తీసుకోవాలి

**తాండూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
వరంగల్ జిల్లాలోని స్మైల్ డీజీ హైస్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై పీడీఎస్‌యూ నాయకుల దాడిని ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం తాండూర్ మండల కేంద్రంలోని విద్యాభారతి విద్యా సంస్థల యాజమాన్యం, ఉపాధ్యాలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థలపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో జోనల్ స్థాయి చెస్ పోటీల ప్రారంభానికి వచ్చిన మండల విద్యాధికారి మల్లేశంకు వినతి పత్రాన్ని అందజేశారు.



# బీఆర్ఎస్ నేతల దాడిని ఖండించిన కాంగ్రెస్ నాయకులు

**తలమడుగు, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
బోథ్‌లో నిర్వహించిన కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముందు ప్రొటాకల్ గురించి అడిగినందుకు ఆత్మ చైర్మన్ గొర్ల రాజు, పసుల చంటిపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ... బోథ్ నియోజకవర్గంలో దాడుల సంప్రదాయాన్ని ప్రోత్సహించడం సరి అయిన పద్ధతి కాదన్నారు. అదేవిధంగా అధికారులు కూడా ముఖ్యమంత్రి సందేశాన్ని చదవకుండానే చెక్కులు పంపిణీ చేయడం సరైన పద్ధతి కాదని, పదవిలో ఉన్న వారిని స్టేజీపైకి పిలిచి కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్. సీనియర్ నాయకులు ప్రకాష్ రావు, వెంకన్న యాదవ్, గంగారం, లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ్, కుమ్మరి నడిపెన్న, విలాస్ యాదవ్, తదితరులు ఉన్నారు.





## విద్యార్థుల్లో కళా నైపుణ్యానికి
# వేదికగా యువజన ఉత్సవాలు

- విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీయడమే యువజన ఉత్సవాల నిర్వహణ లక్ష్యం..
- విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి
- గత ఏడాది రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండో స్థానం
- ఈసారి మరింత ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో నిర్మల్ జిల్లాకు పేరు తేవాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌కు ఎన్‌సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, జీవితంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువజన ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ గుణాలు, బృందాత్మకత పెంపొందుతాయని తెలిపారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈసారి మరింత ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

**పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యం**
**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్...**

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు, సాంస్కృతిక పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యమైందని తెలిపారు. ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంలో, ఆత్మవిశ్వాసం పెంచడంలో దోహదపడతాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో ఈ యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. వివేకానంద భారత యువతకు ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# శ్రావణి కుటుంబానికి అండగా ఉంటాం

- కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- మొదటి విడతగా రూ.4.12 లక్షల మంజూరు అందజేత



**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

దహెగాం మండలం గెర్రె గ్రామంలో అక్టోబరు 18న హత్యకు గురైన శ్రావణి కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ వహిదుద్దీన్‌లతో కలిసి శ్రావణి కుటుంట సభ్యులకు ఇందిరమ్మ ఇల్లు, ఇంటి నిర్మాణానికి మహిళా సమాఖ్య నుంచి లక్ష రూపాయల రుణం చెక్కు, అట్రాసిటీ కేసు పరిహారం ఉత్తర్వులు, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించే ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హత్యకు గురైన శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. శ్రావణి తండ్రి చెన్నయ్య పేరిట ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేశామని అన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి మండల సమాఖ్య నుంచి లక్ష రూపాయల రుణం చెక్కును అందిస్తున్నామని అన్నారు. మొదటి విడతగా రూ.4.12 లక్షలు మంజూరు ఉత్తర్వులను అందజేశామని తెలిపారు. శ్రావణి తండ్రి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తామని అన్నారు. శ్రావణి కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరులకు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన వాటిని అందజేస్తున్నామని శ్రావణి తల్లిదండ్రులకు ఉపాధి నిమిత్తం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వంలో ఏదైనా దుకాణం పెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. శ్రావణి తమ్ముడిని గురుకుల పాఠశాలలో చేర్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.. ఎస్పీ మాట్లాడుతూ శ్రావణిని హత్య చేసిన వారికి కఠిన శిక్ష విధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రక్షణ పరంగా శ్రావణి కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, దహెగాం తహసీల్దార్ షరీఫ్, ఎంపీడీఓ నస్రుల్లా, ఎస్సై విక్రమ్, శ్రావణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## నాణ్యమైన బొగ్గు
# ఉత్పత్తికి కృషి చేయాలి

**సింగరేణి ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ**

**మందమర్రి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి కోసం కృషి చేయాలని ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ తెలిపారు. గురువారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో బొగ్గు నాణ్యత వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సారథ్యంలో సింగరేణి సంస్థ ఉత్పత్తి, రవాణా అన్ని రంగాలలో కొత్త రికార్డులు సృష్టిస్తూ ముందుకు సాగుతున్నదని తెలిపారు. ప్రస్తుత పోటీ మార్కెట్‌లో సింగరేణి సంస్థ కూడా తన బొగ్గు నాణ్యత ప్రమాణాలను మరింతగా పెంచుకోవాల్సిన అవసరంతో పాటు విద్యుత్ సంస్థల పురోగతి మనం సరఫరా చేసే నాణ్యమైన బొగ్గు పైనే ఆధారపడి ఉన్నది అనే విషయాన్ని మనం గ్రహించాలన్నారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి ప్రతి సింగరేణియుడు తనవంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడంలో సహకరించాలన్నారు. అలాగే రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీఎంఓఐ జాయింట్ సెక్రటరీ రవి, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్, శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళను కాపాడిన పోలీసులు

**ముథోల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

ముథోల్ 'పోలీస్ నారిశక్తి' బృందం సమయస్ఫూర్తితో స్పందించి ఆత్మహత్యకు యత్నించిన మహిళ ప్రాణాల్ని రక్షించిన సంఘటన ముథోల్ మండలంలోని వెంకటాపుర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్పీ జానకి షర్మిల ఈ ఘటనపై గురువారం వివరాలను వెల్లడించారు. ముథోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ కుటుంబ సమస్యలతో భాదపడుతూ జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సమాచారం డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న ముథోల్ పోలీస్ నారిశక్తి బృందం సమయస్ఫూర్తితో స్పందించి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొని ఆ మహిళను రక్షించారు. అనంతరం ముథోల్ పోలిస్ స్టేషన్ లో ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఎలాంటి సమస్యల్లో ఉన్నా.. తక్షణ సహాయం కోసం డయల్ 100కు ఫోన్ చేయవచ్చు అని సూచించారు. ముథోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఎస్ఐ పెర్సిస్ పర్యవేక్షణలో విధుల్లో ఉన్న నారిశక్తి బృందం మహిళ ప్రాణాలను రక్షించినందుకు ఎస్పీ అభినందించారు.

# 15న బెల్లంపల్లికి సీపీఐ శతాబ్ది బస్సు జాత రాక

**బెల్లంపల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

భాషెట్టి గంగారాం విజ్ఞాన్ భవన్‌లో సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో గురువారం సీపీఐ శతాబ్ది బస్సు జాత కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ సీపీఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సభకు అన్ని రాష్ట్రాలతో పాటు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ముగింపు సభకు రాష్ట్రంలో మూడు జాతాలను వస్తున్నాయన్నారు. అందులో బాగానే ఈనెల 15వ తేదీ నుండి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జోడేఘాట్ నుండి బస్సు జాత ప్రారంభమవుతుందరన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి నాయకత్వం వహిస్తారని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాల నుండి 100 బైకుల ర్యాలీ ఈ జాతాలో పాల్గొంటదన్నారు. ఈ జాత ఈనెల 15న ఉదయం 11 గంటలకు జోడేఘాట్‌లో మొదలై, ఆసిఫాబాద్, రెబ్బెన, తాండూర్, బెల్లంపల్లి, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్, మంచిర్యాలకు చేరుకుని సాయంత్రం 6:30 గంటల సభతో ముగుస్తుందనీ వెల్లడించారు. ఇక్కడి నుంచి వెళ్ళే జాత 21న భద్రాచలంలో ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, నరసయ్య, రాజేష్ పాల్గొన్నారు.



# కలువర పెడుతున్న గులాబీ పురుగు

**బోథ్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

అతివృష్టితో రైతులు ఇప్పటికే బేజారయ్యారు. దీనికి తోడు గులాబీ పురుగు బెడద రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. బోథ్ మండలంలో పలు చేలలో ప్రత్తికాయలలో ఈ పురుగు దర్శణమిస్తూ రైతులను కలవరపాటుకు గురిచేస్తుంది. గులాబీ పురుగు ఉంటే పత్తి పంటను తీసేయాల్సిన పరిస్థితి వస్తుందని వాపోతున్నారు.





# యార్డ్‌లో మధ్యాహ్న భోజనం ప్రారంభం

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో భోజన వసతి కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఇస్కాన్ ట్రస్ట్ సహకారంతో రైతులకు 10 రూపాయల మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు పాయల శంకర్ తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, డిసిసిబి అడ్డి భోజారెడ్డి రైతులకు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల సౌకర్యార్థం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇస్కాన్ వారి సహకారంతో పది రూపాయలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు బయట మార్కెట్ లో ఎక్కువ ధర ఉన్నందున తక్కువ ధరతో నాణ్యత, హైజీన్ గా ఇక్కడ భోజనం అందించడం జరుగుతుందన్నారు. అమ్మకాల కొరకు మార్కెట్ కు వచ్చిన రైతులకు, వారి వాహనాల డ్రైవర్ లకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒక్క పూట భోజనానికి 35 రూపాయలు ఖర్చు అవుతున్నట్లు అంచనా వేసి, 15రూ. మార్కెటింగ్ శాఖ కాంట్రిబ్యూషన్‌తో, 10రూ. ఇస్కాన్ ట్రస్ట్ కాంట్రిబ్యూషన్‌తో, 10రూ. రైతుల కాంట్రిబ్యూషన్‌తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్కాన్ ట్రస్ట్ సహకారంతో ఈ రోజు ఆదిలాబాద్ మార్కెట్‌లో మధ్యాహ్న భోజనం కార్యక్రమం ప్రారంభించడం శుభపరిణామమని, దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఒకపూట భోజనం పెట్టే అవకాశం దొరికిందన్నారు. జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, ఇతర అధికారులు, ఇస్కాన్ ట్రస్ట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## బీమాతో జీవితానికి ధీమా

### ఇండియన్ పోస్టల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వెంకటస్వామి

**మామడ, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
తపాలా శాఖ ప్రవేశపెట్టిన ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఇండియన్ పోస్టల్ బ్యాంక్ పేమెంట్ బ్రాంచ్ మేనేజర్ వెంకటస్వామి అన్నారు. గురువారం మండలంలోని పునకల్ గ్రామంలో తపాలా బీమాపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఇతర సంఘటనల్లో మరణించినప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తపాలా బీమా చేసినట్లయితే జీవితానికి ధీమాగా ఉంటుందన్నారు. తపాల శాఖలో ఉన్న బీమాకు తక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లించి రూ.10లక్షల వరకు బీమా పొందవచ్చని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తపాలా కార్యాలయం బ్రాంచ్ మేనేజర్ లిఖిత, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిలో

## శ్రీరాంపూర్ టాప్

**శ్రీరాంపూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
2024- 25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి వ్యాప్తంగా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిలో శ్రీరాంపూర్ ఏరియా అగ్రస్థానంలో నిలిచింది. థర్డ్ పార్టీ శాంప్లింగ్, జాయింట్ శాంప్లింగ్ ప్రోటోకాల్ కింద సరఫరా చేసిన బొగ్గుకు సంబంధించి శ్రీరాంపూర్ 75.17 శాతంతో గ్రేడ్ 1 సాధించింది. అలాగే 73.41 శాతంతో ఆర్జీ 2 ఏరియా బీ గ్రేడ్, 71.33 శాతంతో మందమర్రి ఏరియా గ్రేడ్-3 సాధించాయి.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని 268 చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ది పొందడంలో అర్హులైన వారు మధ్య దళారులను నమ్మే అవసరం లేదన్నారు. ప్రభుత్వాలు ఏవైనా, పార్టీలు ఏవైనా అంతిమంగా ప్రజా సంక్షేమం కోసం పని చేయడమే లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యులై వాటిని సద్వినియోగం చేసుకుంటూ ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆర్డీవో స్రవంతి నాయకులు బంతిపెల్లి దయాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంతోనే అమ్మతనం

### పిల్లల ఉచిత వైద్య సేవలకు ముస్తాబైన ఆసుపత్రి





**లోకేశ్వరం, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు భైంసా పట్టణంలోని జిడిఆర్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పూర్తిగా ముస్తాబైంది. టపిల్లల మనసులను ఆకట్టుకునేలా ఆసుపత్రి ద్వారాన్ని కార్టూన్ బొమ్మలతో అలంకరించి, రంగురంగుల తోరణాలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వైద్య సేవలు అందించబోయే గదులను బెలూన్లతో అలంకరించి సర్వాంగ సుందరంగా మార్చారు. హాస్పిటల్ ప్రొప్రైటర్ డాక్టర్ దీపా జాదవ్ స్వయంగా పర్యవేక్షణ చేస్తూ, పిల్లలకు వైద్య సేవలు అందించే ఏర్పాట్లను సమీక్షించారు. బాలల ఆరోగ్య పరీక్షలు నిరాటంకంగా సాగేందుకు అన్ని విధాలా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మ కావాలని ప్రతీ ఒక్క మహిళకు ఉంటుంది. మహిళల ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లను బట్టి వారిలో పిల్లలను కనే పూర్ణత్వం వస్తుంది. ఆడపిల్లలుగా టీనేజ్ కి రాగానే రుతుక్రమం నుండి మహిళగా అనేక దశల్లో ఏదైనా సమస్యవస్తే డాక్టర్ ను సంప్రదించాలి. తగిన చికిత్సలు తీసుకోవాలి. ఇప్పుడున్న మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా ఆరోగ్యం విషయంలో కొందరు అశ్రద్ధ చేస్తుంటారు. ఇది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.దీని వల్ల ప్రెగ్నెన్సీ సమయంలో అనేక సమస్యలు వస్తా యని కాస్మెటిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ దీప యాదవ్ తెలిపారు.భైంసా పట్టణంలోని జిడిఆర్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లోన వైద్యులుఅయిన డాక్టర్ దీప జాదవ్ మహిళల ఆరోగ్యం కాపాడుకోవడం ప్రతి కుటుంబానికి, సమాజానికి అత్యంత ముఖ్యమని అంటున్నారు. మహిళా డాక్టర్‌గా తన అంతరంగం, మహిళల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.



### ఉత్సాహంగా జోనల్ స్థాయి

## క్రికెట్ ఎంపిక పోటీలు

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో గురువారం అండర్-19 బాలురజోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా మాధ్యమిక విద్యాధికారి గణేష్ హాజరై మాట్లాడారు. దేశంలోనే క్రికెట్ ఆట అత్యంత ప్రాచుర్యం పొందిందని పేర్కొన్నారు. ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బాబురావు, ఎన్ఐఎస్ క్రికెట్ కోచ్ జయేంద్ర పటాస్కర్ పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు




**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ కోర్టులో ఒక కేసు విషయంలో నిందితుడిని న్యాయస్థానంలో హాజరు పరచడానికి తీసుకెళ్తున్న న్యాయవాదిపై పోలీసులు ప్రవర్తించిన తీరును నిరసిస్తూ ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. కోర్టు ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ అన్నారు. న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

**జైనూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
రైతులు పండించిన పంటలపై అధైర్యపడవద్దని, ప్రభుత్వం మద్దతు ధరలకే పంటలను కొనుగోలు చేస్తున్నామని జైనూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విశ్వనాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కమిటీ సభ్యులు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. పత్తి తేమ 8 నుంచి12 వరకు ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు.



# కార్పోరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం : సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి మధు



**బెల్లంపల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు కొమ్ముకాస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. గురువారం బెల్లంపల్లి సీఐటీయు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల కనీస హక్కులు లేకుండా కాలరాస్తున్నదని విమర్శించారు. దీంతో కార్మికుల జీవన ప్రమాణాలను అడుగంటి పోతున్నాయని అన్నారు. పెట్టుబాడీదారులకు కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చాడానికి లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్స్‌ను రాష్ట్రంలోని కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచుతు 282 జివోను తెచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను బానిసలుగా మారుస్తుందన్నారు. కార్మికులు పోరాడి తెచ్చుకున్న హక్కుల రక్షణకై, కనీస వేతనాలు సాధనకై, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదే విదంగా జిల్లాలో అసంఘటిత రంగాల కార్మికులు, స్కీం వర్కర్ల, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికు సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ నెల15న తలపెట్టిన జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి రాములు, వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఆశయ్య, సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి సంకే రవి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రమణ, రంజిత్కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్,భానుమతి రాజలింగు, జిల్లా సహాయ కార్యదర్శులు దూలం శ్రీనివాస్, సమ్మక్క, మండల కన్వీనర్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న చలి



- వచ్చే 3, 4 రోజులు మరింత చలి
- 8.5 డిగ్రీలకు పడిపోయే అవకాశం
- సిర్పూర్(యూ)లో 10.2 డిగ్రీలు నమోదు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ
- చలితీవ్రతతో అప్రమత్తంగా ఉండాలని సూచన

**ఆదిలాబాద్ ప్రతినిధి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నడూ లేనట్టుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరికొన్ని రోజులూ ఇదే పరిస్థితి ఉంటుందని, చలి మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీవ్ర చలి ప్రభావిత జోన్‌లో ఉందని కేంద్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ అండ్ హ్యూమన్ హెల్త్ గత ఏడాది ప్రకటించింది. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 3,4 రోజులుగా శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు.

**చలితీవ్రతతో వచ్చే ఆరోగ్య సమస్యలెన్నో...**
తీవ్రమైన చలి కారణంగా ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హైపోథెర్మియా (శరీర ఉష్ణోగ్రత పడిపోవడం), చర్మం లోపలి కణజాలం గడ్డకట్టి గాయాలవడం (ఫ్రాస్ట్‌బైట్) వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. చల్లని వాతావరణం కారణంగా రోగ నిరోధక శక్తి మందగిస్తుంది. వైరస‌లు సులభంగా వ్యాప్తి చెందుతాయి. న్యూమోనియా, ఇతర శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. ఆస్తమా, సీవోపీడీ దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధుల లక్షణాలు తీవ్రతరం అవుతాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తుమ్ములు, తలనొప్పి, ముక్కు కారడం వంటి సమస్యలు వస్తాయి. ఇక చర్మ సమస్యల తీవ్రత పెరుగుతుంది. తీవ్రమైన చలికి లోనైతే రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల రక్తపోటు, గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**వీరికి మరింత అప్రమత్తత అవసరం...**
చలి తీవ్రత నేపథ్యంలో ముఖ్యంగా చిన్నారులు, పెద్ద వయసువారికి సమస్యలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులు, చలిలో ఆరుబయట పనిచేసే కార్మికులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. శరీరాన్ని వెచ్చగా ఉంచే దుస్తులు ధరించాలని, గోరు వెచ్చని నీళ్లు తాగాలని చెబుతున్నారు. చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వేసుకోవాలని, వైరస్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలున్న వారు ఇన్‌హేలర్లను దగ్గర ఉంచుకోవాలని, బయటికి వెళితే మాస్క్ ధరించాలని స్పష్టం చేస్తున్నారు. చిన్నారులు, పెద్ద వయసు వారు బయటికి వెళ్లకపోవడం మంచిదని పేర్కొంటున్నారు.

**మరింత పెరగనున్న చలి...**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శీతాకాలాన చలి పులి పంజా విసురుతోంది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత మరింత పెరిగింది. నేడు రాత్రి ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా అదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీమ్‌లో ఈ రాత్రి 8-9 డిగ్రీల వరకు చలి నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గత 24 గంటల్లో అదిలాబాద్‌లో 11.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డయ్యాయి. ఉత్తర భారతదేశం నుంచి వీచే చల్లని గాలులు, ఆకాశంలో మేఘాలు లేకపోవడంతో చలి మరింత తీవ్రమవుతోంది. రాబోయే మూడు రోజులు ఈ పరిస్థితి కొనసాగనుంది. చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9గంటల వరకు పొగ మంచు కమ్ముకుంటోంది. మంగళవారం రాత్రి అత్యల్పంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో10.2 డిగ్రీలు, లింగాపూర్‌లో 10.5,ఆదిలాబాద్ జిల్లా సాత్నాలలో 11.1, బోథ్ మండలం పొచ్చెరలో 11.2 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



# టీచర్లకు ప్రభుత్వం షాక్.. సర్వీస్ టీచర్లు సైతం టెట్ క్వాలిఫై కావాల్సిందే



## నేడు ఉత్తర్వులను జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

**ఆదిలాబాద్ ప్రతినిధి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
టీచర్లకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. తెలంగాణలో ఇకపై సర్వీస్ టీచర్లు సైతం టెట్ క్వాలిఫై కావాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేయనుంది. దీంతో ఇకపై టీచర్లు సర్వీస్‌లో ఉండాలన్నా.. ప్రమోషన్లు పొందాలన్నా టెట్ క్వాలిఫై తప్పనిసరి అని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టెట్ నిబంధనలను తెలంగాణ విద్యా శాఖ సవరణ చేసింది. 2009 తర్వాత నియమితులైన 30 వేల మంది టీచర్లకు ఈ నిబంధన వర్తించనుంది. రానున్న రెండేళ్లలో సర్వీసులో ఉన్న టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సిందేనన్నది సుస్పష్టం. మరోవైపు.. టెట్ నోటిఫికేషన్‌ను గురువారం తెలంగాణ విద్యా శాఖ విడుదల చేసింది. నవంబర్ 15వ తేదీ నుంచి ఈ దరఖాస్తులను అభ్యర్థుల నుండి స్వీకరిస్తారు. నవంబర్ 29వ తేదీతో ఈ దరఖాస్తులు స్వీకరణ ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. కాగా.. ఈ ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ఈ పరీక్షల ఫలితాలు కాగా, జులై 22న వెల్లడయ్యాయి. తాజాగా గురువారం రెండో విడత టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా ఈ టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లంతా ఈ పరీక్ష పాస్ కావాల్సి ఉంది.




## న్యాయవాదిపై దౌర్జనానికి పాల్పడ్డ

# పోలీసులను శిక్షించాలి

## విధులు బహిష్కరించి నిరసన

**ఉట్నూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ కోర్టులో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న న్యాయవాది పి.అనిల్ కుమార్‌పైన అక్కడి సీఐ కృష్ణ, ఎస్సైలు సంజీవ్ అశోక్‌లతో పాటు వారి సిబ్బంది తీవ్ర దౌర్జన్యానికి పాల్పడి న్యాయవాది వాహనాన్ని తీవ్రంగా ధ్వంసం చేసిన పోలిసుల వైఖరిని నిరసిస్తూ గురువారం ఉట్నూర్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఎదుట కొద్దిసేపు నిరసన చేసి అనిల్ కుమార్ కు సంఘీభావం వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదిపై కోర్టు ఆవరణలో పోలీసులు దౌర్జన్యానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్టాలు ఎవరికీ చుట్టాలు కాదని అలాంటిది పోలీసులు మర్చిపోయి చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. న్యాయవాదిపై దౌర్జన్యానికి పాల్పడి వాహనాన్ని ధ్వంసం చేసి న్యాయవాద వృత్తిని అవమానపరచిన పోలీసు అధికారులపై వారికీ సహకరించిన సిబ్బందిపై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.జైవంత్ రావు న్యాయవాదులు జమీర్ ఖాన్ ధీరజ్ గుప్తా పెందూర్ ప్రభాకర్ చింతల గిరి శ్రీనివాస్ వసంత్ రావు కుడెల్లి అశోక్ చంద్రమౌళి నాతరి రాజు జాదవ్ విశాల్ వినోద్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మా అమ్మ నాన్న ఫౌండేషన్

# ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

**లోకేశ్వరం, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా సిర్గాపూర్ పరిసర ప్రాంతాల్లో గుడిసెల్లో చలితో వణుకుతున్న నిరుపేదలకు అభాగ్యులకు లోకేశ్వరం మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు ఆధ్వర్యంలో 25 మంది నిరుపేద అభాగ్యులకు వృద్ధులకు, దుప్పట్లు పంపిణీ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాతల సహకారంతో చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు మానవతా దృక్పథంతో మానవసేవే మాధవసేవ విధానంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వృద్ధులకు, పేదవారికి, నిరాశ్రయులకు, యాచుకులకు సేవా కార్యక్రమాల ద్వారా సహాయ మందించాలన్నారు.



## బెల్లంపల్లి, కాసిపేట మండలాల అటవీ ప్రాంతంలో

# పెద్దపులి సంచారంతో భయాందోళన

**బెల్లంపల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, కాసిపేట మండలాల అటవీ ప్రాంతంలో గురువారం సాయంత్రం పెద్దపులి సంచరించడం ఆందోళన రేకెత్తిస్తోంది. అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న బుగ్గగూడెం, కరిశెలఘట్టం, పల్లం కూడా, వరి పేట పరిసరాల్లో పెద్దపులి సంచరించినట్లు తెలిసింది. పెద్దపులి రెండు రోజులుగా ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. పెద్దపులి సంచరిస్తున్న ఈ ప్రాంతాల్లో పత్తి చేలు విపరీతంగా పెరిగి ఉండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పంట పొలాలు, పత్తి చేలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. వీలైనంతవరకు రాత్రి సమయాల్లో బయటకు వెళ్ళవద్దని, పశువులను అడవుల్లోకి పంపకుండా ఇళ్ల వద్దే కట్టేసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను ఆడుకునేందుకు పత్తి చేల వైపు పంపవద్దని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం సంచరిస్తున్న పెద్దపులిని రెండు



నెలలుగా కాసిపేట, ధర్మారావుపేట అడవుల మీదుగా తిర్యాణి వైపు రాకపోకలు సాగిస్తున్న పెద్దపులిగానే అనుమానిస్తున్నారు. ఏది ఏమైనా బుగ్గ గూడెం, వరి పేట అడవుల్లో మళ్లీ పెద్దపులి సంచారం గుబులు రేపుతుంది.




■ మరిచిపోలేనిది బాల్యం ■ నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు ■ బాలల దినోత్సవానికి ముస్తాబైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు

**ముథోల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)** నేటి బాలలే రేపటి పౌరులు, దేశ భవితవ్యం బాలల పైనే ఆధారపడి ఉంది. బాలలు సక్రమమైన దారిలో నడిస్తేనే దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు, గ్రామానికి మంచి పేరు, ప్రతిష్టలు, కీర్తిలభిస్తాయి. అలా కాకుండా బాలలు పెడతోవపడితే దేశ భవితవ్యం నాశనమై పోతుంది. బాలల పర్వదినంను నెహ్రు జన్మదినంగా జరుపుకోవడం ప్రతియేటా జరుగుతుంది. నేటి బాలలను సక్రమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత, అవశ్యకత తల్లితండ్రులు, గురువులపైనే ఎంతైనా ఉంది. పిల్లలను సన్మార్గంలో పయనింపజేస్తే దేశం అన్ని రంగాల్లో బలపడి ఇతరులకు ఆదర్శప్రాయమవుతుంది. ఈ సత్యాన్ని గ్రహించిన పండిత్ జవహర్‌లాల్ నెహ్రు నవంబర్ 14వ తేదీని తన జన్మదినదినంగా గుర్తించవద్దని, బాలల దినోత్సవంగా గుర్తించాలని పేర్కోన్నారు. అందుకే చాచా నెహ్రు జన్మదినోత్సవాన్ని బాలల దినోత్సవంగా పేర్కొంటారు. చాచా నెహ్రు జన్మదినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. చిట్టి పొట్టి మాటలతో.. బుడిబుడి.. వడివడి నడకలతో భలే.. భలే..బాలల.. చిన్నారులు.. భావి భారత పౌరులారా.. హాయ్.. పిల్లలు.. ముందుగా హ్యాపి చిల్డ్ర న్సడే శుభాకాంక్షలు.. బాలల బంగారు భవిష్యత్తులోనే భారతదేశ భవితవ్యం ఆదార పడి ఉందని చెప్పిన మహానుబావుడు మన జవహార్‌లాల్ నెహ్రూ.. (పిల్లలు ముద్దుగా పిలుచుకునే దాదాజి).. పండిత్ జవహార్ లాల్ నెహ్రూ నవంబర్ 14న జన్మించాడు. దాదాజీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మనం బాలల దినోత్సవం జరుపుకుంటాము. ఈ విషయాన్ని స్వయంగా జవహార్ లాల్ నెహ్రూనే నవంబర్ 14వ తేది తన పుట్టిన రోజును జన్మదినంగా గుర్తించవద్దని.. ఆరోజును బాలల దినోత్సవం (చిల్డ్రన్స్‌డేగా గుర్తించాలని చెప్పారు. దాదాజీకి పిల్లలు అంటే చాలా ఇష్టం.. కల్ల కపడం ఎరుగని లేత మనుసులలో ఎలాంటి కల్మషం ఉండదని నెహ్రూజీ అనేవారు. అందుకే పండిత్ జవహార్‌లాల్ నెహ్రూ ధరించే కోటు మీద చిన్నారుల ఇచ్చిన గులాబీ పూవ్వునే ఇప్పటికి ఫొటెలోనూ చూస్తుంటాము.

**దేశ కీర్తిపతాకపు రెపరెపలు..**

నేటి బాలలే భావి భారత పౌరులుగా అంటుంటాము. వీరే గనుక సరైన మార్గంలో పయనిస్తే మన దేశ కీర్తి పతాకపు రెపరెపలు ప్రపంచానికి కనిపిస్తాయి. ప్రపంచ ంలోనే అత్యున్నత స్ధానం మనకు లభిస్తుంది. అలా కాకుండా చెడు ధారిలో పయనిస్తే వారి మనుగడకు ముప్పు తెచ్చుకున్నవారే కాకుండా దేశపు కీర్తి ప్రతిష్టలను నాశనం చేసిన వారు అవుతారనే సత్యాన్ని గ్రహించిన వారిలో ప్రప్రథమైన వ్యక్తి పండిత్ జవహార్ లాల్‌నెహ్రూ మరి నేటి బాలలను సక్రమంగా తీర్చి దిద్దాల్సిన భాద్యత ఎవరిది..? ముందుగా జన్మనిచ్చిన తల్లి దండ్రుల మీద ఆ బాధ్యత ఉంటుంది. అనంతరం విద్యబుద్దులు నేర్పే గురువు మీద ఉంటుంది. మీరు పిల్లల భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దితే దేశం అన్ని విధాలుగా బలపడి ప్రపంచ దేశానికే ఆధర్శంగా నిలుస్తుంది. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని వాళ్ళకు ఈ బాలల దినోత్సవం కనువిప్పు కలుగుతుంది.

**పాఠశాలలో ఆట.. పాట.. సాంస్కృతిక కార్యక్రమాలు..**

స్వర్గీయ భారత ప్రధాని పండిత్ జవహార్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జరుపుకునే బాలల దినోత్సవాన్ని పాఠశాలల్లో ఘనంగా వేడుకలు నిర్వహిస్తుంటారు. పిల్లలో ఉన్న సృజనాత్మకతలను వెలికితీసే దిశలో పాఠశాలలు పది రోజుల ముందు నుంచి వేడుకలను నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వపోటీలు, కోలాహాలంగా పిల్లలతో ఆడి.. పాడించడం, గెలుపొందినవారికి బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుంది.

## ముద్దలొలికే.. పలుకులు



నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా 14 ఏళ్లలోపు పిల్లల నుంచి 'ప్రభాత సమాచారం' నచ్చిన గురువు, నచ్చిన ప్రదేశం తదితర అంశాలపై వారి అభిప్రాయాలను ఆహ్వానించింది.. ఈ మేరకు చిట్టి చేతులు స్పందించాయి.. తమ మనోగతాలను లేఖల రూపంలో పంపించారు. ఆయా ప్రాంతాల విశిష్టతలను లేఖల రూపంలో సంధించారు. వివరాలు వారి మాటల్లోనే..

### స్నేహమంటే ఒక ఆత్మీయ బంధం

స్నేహం అంటే ఒక ఆత్మీయత బంధం.. కులం, మతం ఏదీ చూడని ఒక తీయని బంధం. ప్రపంచంలో స్నేహితులు లేని వారు ఎవరూ ఉండరు. ఒక్కోసారి కుటుంబ సభ్యులకు చెప్పని విషయాలను స్నేహితులతో పంచుకుం టాం.. అపూర్వ నా ప్రాణ స్నేహితురాలు.. మేము ఒకే పాఠశాలలో చదువుకుంటున్నాం. రోజంతా కలిసిమెలిసి ఉంటాం.. తను నాకంటే తెలివైంది.. చదువులో నాకు సాయం చేస్తుంది. నా పుట్టిన రోజుకు ఇష్టమైన బొమ్మను కానుకగా ఇచ్చింది.. నేనూ బహుమతి ఇచ్చాను. ఎంతో సంతోషిం చింది. పెద్దయ్యాక కూడా ఈ స్నేహం ఇలాగే ఉండాలని ఆశిస్తున్నాను..

అఖిల,ఎనిమిదో తరగతి

# చాచా మాట ఆచరిస్తేనే పూబాట..!

**పసి పిల్లలంటే చాచా నెహ్రూకి ప్రాణం.. భావి భారత నిర్మాతలు వారేనని ఆయన పేర్కొన్నారు. పిల్లలను ఆయన ఎంతగా ప్రేమించేవారో మాటల్లో చెప్పలేనిది.. పిల్లలు సంపూర్ణ, సమర్థ మానవ వనరులుగా ఎదగాలని ఆయన ఆశించేవాడు.. కానీ.. నెహ్రూ ఆశయాలు నేడు ఆదరణకు నోచుకోవడం లేదు. ఫలితంగా... రేపటి పౌరులు. కష్టాల సుడిలో చిక్కుకుంటున్నారు. ఇంతకీ చాచా ఏమన్నారో.. జిల్లాలో చిన్నారులు ఎలా ఉన్నారో కథనం..**

**తన పిల్లవాడి గురించి తనకు అవగాహన ఉన్నవాడే సరైన తండ్రి : నెహ్రూ**

పిల్లల క్రమశిక్షణ, చదువులే రేపటి భవిష్యత్తును దిశానిర్దేశం చేస్తాయి.. ప్రస్తుత సమాజంలో పిల్లల బాగోగులు పట్టించుకోవడంలో మార్పులు చోటు చేసుకున్నాయి.. ఉద్యోగ రీత్యా ఉరుకుల పరుగుల జీవనంలో పిల్లలపై అంతగా శ్రద్ధ చూపడం లేదు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడిలో గడిపిన పిల్లలు రాత్రిపూట హోమ్‌వర్క్‌తో బిజీబిజీగా గడిపి.. ఆలస్యంగా నిద్రకు ఉపక్రమిస్తున్నారు. తెల్లవారాక మళ్లీ హడావుడి మొదలు.. వారు బాగా మార్కులు సంపాదిస్తున్నారా లేదా అన్నది చూడటం తప్ప చదువు, నడవడికపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు కన్నేసి ఉంచలేకపోతున్నారు.

**దేశ భవిష్యత్తును నిర్మించేది పార్లమెంటు కాదు పిల్లలే : నెహ్రూ**

ఒక్కో రంగంలో పరిపూర్ణత సాధిస్తేనే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి పథాన పయనిస్తుంది.. అందుకు క్షేత్రస్థాయిలో బాలల ఆలోచన సరళి ప్రధానం. జిల్లాలో 3లక్షల మంది 13ఏళ్లలోపు బాలలున్నారు. వీరంతా తమ మేథస్సుకు పదును పెడితేనే భవిష్యత్తులో సత్ఫలితాలను అశించవచ్చు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి దాదాపు 3.4లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏటా క్రీడలు, వైజ్ఞానిక ప్రదర్శన, ఇతర పోటీల్లో పాల్గొనేది కొద్ది మంది మాత్రమే.. అనేక పాఠశాలల్లో ప్రయోగశాలలు లేవు.. ఈ ఏడాది పాలమూరు జిల్లా నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇలాంటి వారి అడుగుజాడల్లో నడిస్తేనే నెహ్రూ ఆశయం నెరవేరుతుంది.

**పసి హృదయం గాయపరచొద్దు : నెహ్రూ**

చాచా నెహ్రూకు పసిపిల్లలంటే ప్రాణం.. పిల్లలను దండిస్తే క్షమించరాని నేరమని ఆయన పేర్కొనేవారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రేమతో




చూసుకోవాలి.. కానీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. చదువుల భారంతో పసిపిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. చదువు ఒక్కటే లక్ష్యంగా పిల్లలను బడికి పంపుతున్నారు. పాఠశాలల్లో పరిస్థితి అదే రీతిన కనిపిస్తుంది. గంటల తరబడి చదువులు పసిపిల్లలను కుంగదీస్తున్నాయి.. ఉపాధ్యాయులు దండించడం తగదని చట్టాలు తెచ్చినా క్షేత్రస్థాయిలో మాత్రం అవి అమలు కావడం లేదు.. జిల్లాలో పిల్లలను దండించి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టిన ఘటన చోటు చేసుకుంది.. వెలుగులోకి రాని ఘటనలు చాలా ఉన్నాయి. పిల్లల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి.. మానసికంగా ఒత్తిడికి గురిచేయొద్దు.. చదువుల భారం మోపొద్దు. పిల్లలు ఆసక్తి కనబరిచే అంశాలపై తల్లి దండ్రులు దృష్టి సారించాలి.. నేటి బాలలే రేపటి పౌరులు.. భావిభారత నిర్మాతలని చాచా నెహ్రూ పేర్కొన్న మాటలను నిజం చేయాలి.

### నేను చేసిన మంచిపని..

నా పేరు వంగ వైష్ణవి. ప్రతిసారి ఏటా పుట్టిన రోజు ఇంట్లోనే జరుపుకునే వాణ్ని. ఒక్క పుట్టిన రోజుకు పాఠశాలకు వెళుతుండగా.. కొంత మంది యాచక పిల్లలను చూసినాకు జాలేసింది.. గత రెండేళ్లుగా నా పుట్టిన రోజున ఇంట్లో పులిహోర తయారు చేయించి వంద ప్యాకెట్లను బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో యాచక పిల్లలకు అందజేస్తున్నాను. ఆ ఒక్కరోజు వారి కడుపు నింపుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంటోంది. ఈ విషయం మా ఉపాధ్యాయులకు తెలియడంతో వారు నన్ను అభినందించారు. మీరు కూడా మీ పుట్టిన రోజునాడు సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరుకుంటూ..

-వంగ వైష్ణవి, బ్రిలియంట్ హైస్కూల్

### నీతి, నిజాయితీ గురించి బోధన

హాలో ఫ్రెండ్స్..! నా పేరు త్రిశాలిక. నేను విజయ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాను.. నాకు నచ్చిన ప్రదేశం పాఠశాలే. ఎందుకంటే అక్కడ చదువుతోపాటు అన్ని విషయాలు నేర్పుతారు. ప్రతిరోజు నేను ఖోఖో, కబడ్డీ ఆడుతాను. ప్రతిఏటా పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా టాలెంట్ షో నిర్వహిస్తారు. ఇందులో పీపీ-1 నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. నాకు ప్రతిసారి క్రీడల్లో, వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతులొస్తాయి..

-త్రిశాలిక, ఆరో తరగతి

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, పనుల పురోగతిపై సమీక్ష



## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
నేరడిగొండ, బేలా, భీంపూర్, బోథ్, జైనథ్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కిచెన్ షెడ్, ప్రహరీగోడ వంటి మౌలిక సదుపాయాల కల్పన, పనుల పురోగతిపై గురువారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మూడవ దశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, పాఠశాలల్లో ప్రాథమిక వసతులు సమగ్రంగా అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల విద్యార్థుల సౌకర్యం, భద్రత దృష్ట్యా మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ కనెక్షన్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడలు పూర్తి స్థాయిలో ఉండాలని సూచించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఈవో రాజేశ్వర్, అధి కారులు, ఆయా మండలాల ఎంఈఓలు, కోఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.





# ప్రిన్సిపాల్‌పై దాడికి నిరసన

**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
వరంగల్ జిల్లాలోని స్మైల్ డిజీ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పై పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ గురువారం మంచిర్యాల జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, పాఠశాలల ఉపాధ్యాయులు ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా కోశాధికారి ఉదారి చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరారు. మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు కొమ్ము దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ జరిగిన సంఘటనను ఖండిస్తూ, పాఠశాల ఆవరణలోకి కేవలం తల్లిదండ్రులను మాత్రమే అనుమతించే విధంగా, విద్యార్థి సంఘ నాయకులకు, కుల సంఘ నాయకులకు, రాజకీయ నాయకులకు, ఇతరులు ఎవరికీ పాఠశాల లోపలికి అనుమతిని ఇవ్వకుండా ఒక జీవో విడుదల చేయాలన్నారు. పాఠశాలలపై, పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులపై దాడులు జరుగకుండా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి దాడులను చూసి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాలంటే భయం అవుతుందని, పాఠశాలలో శ్రద్ధతో స్వేచ్ఛగా పాఠాలు చెప్పుకునే గురువులు ఆత్మ రక్షణ కోసం ఇలా రోడ్లపైకి వచ్చి జరిగిన సంఘటనపై నిరసన తెలిపే పరిస్థితి రావడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు రాపోలు విష్ణువర్ధన్ రావు, కస్తూరి పద్మ చరణ్, యార్లగడ్డ బాలాజీ, పట్టణ కార్యదర్శి సాదిక్ పాషా, కోశాధికారి మోహన్ వర్మ పాల్గొన్నారు.

# భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యత

**నార్నూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యతని నార్నూర్ ఎంపీడీవో పుల్లారావ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ఉమ్రి, కొత్తపల్లి హెచ్, జామడ, మరప గూడ, ముల్లంగి, ఖైరదట్వా, నార్నూర్‌తో పాటు గాదిగూడ మండలంలోని ధాబాకే ప్రభుత్వ పాఠశాలలో మనబడి.. మన నీరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల పరిధిలో ర్యాలీ నిర్వహించి నీటి సంరక్షణ పై అవగాహన కల్పించారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టు భూమిలోకి ఇంకిపోయేలా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. నీటి సంరక్షణతో భూగర్భ జలాలు




పెరిగి నీటి కొరత లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాదవ్ విఠల్, ప్రత్యేక అధికారులు అరవింద్, నవీన్ రెడ్డి, గంగాధర్, సూపరింటెండెంట్ రాథోడ్ గంగా సింగ్ , టెక్నికల్ అసిస్టెంట్లు జాదవ్ కైలాస్, చౌహాన్ వికాస్, మోహన్, పంచాయతీ కార్యదర్శులు మోతిరామ్, రూప్‌దేవ్, సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు చెస్ పోటీలు




**తాండూర్,నవంబర్13 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి ఎస్ మల్లేశం అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు పోటీలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అధ్వర్యంలో అండర్- 14,17 చెస్ బాలురు, బాలికల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల జోనల్ స్థాయి ఎంపిక పోటీలు గురువారం తాండూర్ మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు ముఖ్య అతిధిగా ఎంఈవో ఎస్.మల్లేశం, సభ అధ్యక్షుడిగా పోటీల కన్వీనర్, పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించ దానికి పోటీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. శరత్ కుమార్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపు ఓటములు సహజమేనని ఓడిన వారు నిరుత్సాహపడకుండా విజయం వైపునకు దృష్టి పెట్టాలన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో కూడా పాల్గొని ఉమ్మడి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కొనియాడారు. ఈ పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జగిత్యాల జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని క్రీడా సమాఖ్య ప్రతినిధి, ఎస్ జీ ఎఫ్ సెక్రటరీ ఎండీ యాకూబ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాఠశాల ఆకాడమీ డైరెక్టర్ సౌమ్య, ప్రిన్సిపాల్ సరోజినీ, పోటీల పరిశీలకురాలు కల్పన, ఎస్జీఎఫ్ అదిలాబాద్, అసిఫాబాద్ సెక్రటరీలు స్వామి, వెంకటేష్, నిర్వాహక కార్యదర్శులు, పీఈటీలు బాలకృష్ణ, రాజు, తారకేశ్వరి, వ్యాయామ ఆపాధ్యాయులు నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్టలో

# కాంగ్రెస్ నాయకుల పూజలు

**బెల్లంపల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆయురారోగ్యాలతో ఉండాలని గురువారం యాదగిరిగుట్టశ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, మాజీ జెడ్పిటిసి రామ్‌చందర్, టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దావ రమేష్ లు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు భూమన్న, మహేష్ తదితరులు ఉన్నారు.

# అనుమతి లేని ప్లాట్లను కొనొద్దు



**మందమర్రి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
మండలంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో అసైన్డ్ భూముల్లో కొంతమంది ఫ్లాట్లు చేసి అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ప్రజలు అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోవద్దని తహసీల్దార్ సతీష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అసైన్డ్ భూములను కొంత మంది అన్యాక్రాంతంగా వెంచర్లు చేస్తున్నారనీ ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా వెంచర్లు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు సమయంలో పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

# గుండెపోటుతో వ్యక్తి మృతి

**తిర్యాణి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
తిర్యాణ మండలంలోని మంగి విద్యుత్ శాఖలో ఫీడర్‌లో కాంట్రాక్టర్ కార్మికుడిగా పని చేస్తున్న మారుతి (38) ఉదయం వాకింగ్‌కుగుండెపోటుతో మృతి చెందినట్లుకుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మార్నింగ్ వాకింగ్ వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య విజయలక్ష్మి వెళ్లి చూడగా మార్గమధ్యంలో పడిపోయి ఉండగా అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిరక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

# రైతు ధీమాగా ఉండాలంటే పంట బీమా అవసరం : ఎమ్మెల్యే పాయల్ శంకర్

**జైనథ్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ప్రమాద సమయాల్లో రైతులకు అండగా నిలిచేందుకు పంటల బీమా ఉంటేనే రైతులకు ధీమాగా ఉంటుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఓ రైతు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల నిల్వ ఉంచిన పత్తి దగ్ధం అయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం బాధిత రైతు ఇంటికి వెళ్ళి ప్రమాదంలో దగ్ధమైన పత్తిని పరిశీలించి రైతుతో మాట్లాడి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంట అమ్ముకునేందుకు సిద్ధంగా ఉండగా అగ్ని ప్రమాదంలో దగ్ధం అవ్వడం ఎంతో నష్టాన్ని చేకూరుస్తోంద న్నారు. ప్రమాద సమ యాల్లో భీమా ఉంటే రైతు లకు ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు.



సినిమా




## జాతిరత్నాలనే మరిపించిన జిగ్రీస్

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ జిగ్రీస్ మూవీ నవంబర్ 14న థియేటర్లలోకి రానుంది. హరీష్ రెడ్డి ఉప్పల దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీలో ఫ్రెండ్‌షిప్, అడ్వెంచర్స్, ఎమోషన్స్ ఉన్నాయి. మౌంట్ మేరు పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని కృష్ణ వోడపల్లి ఈ చిత్రాన్ని నిర్మించారు. అయితే నేడు ప్రీమియర్ షోలు వేయగా.. ఫుల్ మూవీ రివ్యూ వచ్చేసింది. మరి ఎలా ఉందో రివ్యూలో తెలుసుకుందాం. టైటిల్ కి తగ్గట్టే ఇది నలుగురు జిగ్రీస్ కథ. ఇలాంటి సినిమాలలో కథ అంతగా ఉండదు. ఉండాల్సిందల్లా కామెడీ. ప్రతీ సీన్ ని హిలేరియస్ మెప్పించాలి. ఒకొక్క సీన్ పేర్చుతూ వెళ్లి నవ్వించగలిగితే చాలు సినిమా నిలబడుతుంది. ఆ విషయంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు అనే చెప్పాలి. ముఖ్యంగా లారీ సీన్, ఓ ఊర్లో నాటుకోడి ఎపిసోడ్ నవ్వులు పూయిస్తాయి. ముఖ్యంగా కాండోమ్ సీన్ హిలేరియస్ గా నవ్విస్తుంది. మావోయిస్టుల బ్లాక్ కూడా ఓ మాదిరిగానే మెప్పిస్తుంది. జిగ్రీస్.. కథలో అహా ఓహో అనే మలుపులు ఉండవు. కానీ అరే మన గ్యాంగ్ కూడా ఇలాంటిదే కదా, మన ఫ్రెండ్స్ కూడా ఇలాంటి వాళ్లే కదా అనిపిస్తుంది. మన కథని మనం తెరపై చూసుకుంటున్నట్టు ఉంటుంది. కానీ చివర 15 నిమిషాలు మాత్రం మనసుని ఎంతో బరువెక్కిస్తుంది. అలా జరగకుండా ఉంటే బాగుండేది కదానిపిస్తుంది. తడిసిన కళ్లతో చెమర్చిన భావోద్వేగంతో బయటకు వస్తారు. జాతిరత్నాలనే ఈ సినిమా మరిపించిందని ప్రేక్షకులు అంటున్నారు. లీడ్ రోల్ చేసిన కృష్ణ బూరుగుల పర్ఫార్మెన్స్ బాగుంది. సినిమాని స్టార్టింగ్ నుండి ఎండ్ వరకు స్టీల్ చేసాడు. రామ్ నితిన్ పర్లేదు బానే చేసాడు. ధీరజ్ ఆత్రేయ చాలా సహజంగా అమాయమైన నటనతో కామెడీ పండించాడు. మనీ వాక సినిమాలో కీలకమైన పాత్ర, అసలు కథ మొత్తం తన చుట్టూనే తిరుగుతుంది. అయితే ఎమోషన్ సీన్స్ నటనలో అనుభవం ఇంకొంత అవసరం. సినిమాటోగ్రఫీ కలర్ఫుల్ గా బాగుంది. కమ్రాన్ మ్యూజిక్ గుడ్. ప్రొడక్షన్ వ్యాల్యూస్ బాగున్నాయి. ఓవరాల్‌గా చూసుకుంటే మన చిన్ననాటి జాన్ జిగ్రీలతో గడిపిన క్షణాలని మరోకసారి గుర్తు చేసే సినిమా. ఎలాంటి అంచనాలు లేకుండా సరదాగా ఫ్రెండ్స్‌తో వెళ్తే నవ్వుకోవచ్చని ప్రేక్షకులు అంటున్నారు.



## అందాల రాశి



## 'SSMB29' ఈవెంట్ డిటైల్స్ పై రాజమౌళి క్లారిటీ..!

సూపర్ స్టార్ మహేష్ బాబు దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో వస్తున్న భారీ చిత్రం 'SSMB29' చుట్టూ అభిమానుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరుకుంది. ఈ సినిమా నుంచి ప్రతి అప్‌డేట్ కోసం సినీ ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మొదటి ఈవెంట్ "గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్" నవంబర్ 15న హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి ప్రత్యేక వీడియో విడుదల చేసి అభిమానులకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ ఈవెంట్‌కు కేవలం పాస్‌లు ఉన్న వారినే అనుమతిస్తారని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న "ఎవరైనా వెళ్లొచ్చు" అనే వార్తలను నమ్మొద్దని హెచ్చరించారు. అభిమానులందరూ క్రమశిక్షణగా వ్యవహరించాలని, ఈవెంట్‌ను జియో హాట్‌స్టార్‌లో లైవ్‌గా వీక్షించవచ్చని తెలిపారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి నటుడు పృథ్విరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా జోనస్ ల ఫస్ట్ లుక్స్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టించాయి. ముఖ్యంగా ప్రియాంక చోప్రా 'మందాకిని' లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. పసుపు చీరలో గన్ పట్టుకుని కనిపించిన ఆమె కేవలం కొద్ది నిమిషాల్లోనే ట్రెండింగ్ టాపిక్‌గా మారింది. ఇప్పుడు అందరి దృష్టి మహేష్ బాబు ఫస్ట్ లుక్ పైనే ఉంది. ఆయన లుక్ ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. సమాచారం ప్రకారం మహేష్ బాబు ఫస్ట్ లుక్ నవంబర్ 14న విడుదల కావచ్చని చెబుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఆ లుక్‌ను నవంబర్ 15న జరగబోయే ప్రత్యేక ఈవెంట్‌లోనే ఆవిష్కరించనున్నారని అంటున్నారు. రాజమౌళి సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన ప్రెజెంటేషన్, అద్భుతమైన విజువల్స్ ఉంటాయి. కాబట్టి మహేష్ బాబు లుక్ ఆ ఈవెంట్‌లో ఘనంగా విడుదలయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. సోషల్ మీడియాలో ఇప్పటికే అభిమానులు హ్యాష్‌ట్యాగ్‌లతో ఊహాగానాలు మొదలుపెట్టారు. "మహేష్ గ్లోబల్ అవతార్ ఎలా ఉంటుంది?", "రాజమౌళి ప్రెజెంటేషన్ ఏ స్థాయిలో ఉంటుంది?" వంటి ప్రశ్నలు నెట్‌లో హిట్‌గా మారాయి. 'గ్లోబ్‌ట్రాటర్' మహేష్ బాబు కెరీర్‌లోనే కాదు, భారతీయ సినీ చరిత్రలో కూడా ఒక పెద్ద మైలురాయి అవుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో షూటింగ్ జరగబోయే ఈ సినిమా యాక్షన్, అడ్వెంచర్, డ్రామా అంశాలతో తెరకెక్కనుంది.

ఊహలు గుసగుసలాడే సినిమాతో పదేళ్ల క్రితం టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేసింది. స్టార్ హీరోలకు ఈ అమ్మడు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోలేదు. అయినా కూడా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకోవడంలో సఫలం అయింది. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం తెల్సిందే. కెరీర్ ఆరంభంలో కాస్త బరువు ఎక్కువగా అనిపించినప్పటికీ ఆ తర్వాత బరువు తగ్గి సన్నగా నాజూకుగా కనిపించింది. బరువు తగ్గడంతో టాలీవుడ్ తో పాటు, ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తూ ఉండటంతో ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూ ఉంది. పేరుకు తగ్గట్టు అందాన్ని రాశి పోసినట్లుగా అనిపించే రాశి ఖన్నా ఆకట్టుకునే రూపంతో అలరిస్తుంది. వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టాలీవుడ్‌లో స్టార్ హీరోలకు జోడీగా ఎక్కువ సినిమాలు చేయలేక పోయింది అంటూ ఒక నిరుత్సాహం ఉన్నప్పటికీ టైర్ టూ హీరోలతో ఎక్కువగా సినిమాలు చేయడం ద్వారా మంచి విజయాలను సొంతం చేసుకుంది. తెలుగులో ఆఫర్లు తగ్గుతున్నాయి అనుకున్న సమయంలో కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ ఆఫర్లు రావడం ద్వారా రాశి ఖన్నా కెరీర్ మళ్లీ పుంజుకున్నట్లు అయింది. పదేళ్లు దాటినా కూడా ఇంకా ఫుల్ బిజీగా ఉన్న రాశి ఖన్నా ఎప్పటిలాగే సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. ఆకట్టుకునే అందంతో పాటు నటనతో మెప్పించే రాశి ఖన్నా మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచింది. తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. క్లీ వేజ్ షో తో మతి పోగొడుతూ, లాంగ్ డ్రెస్‌లో రాశి చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సింపుల్ మేకోవర్‌తో పాటు, మేకప్, డ్రెస్‌కి తగ్గట్లుగా హెయిర్ స్టైల్ ఉండటంతో మెరిసి పోతుంది. రాశి ఖన్నా చూపుతో మతి పోగొడుతోంది అంటూ అభిమానులతో పాటు, అంతా కూడా తెగ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. ఆకట్టుకునే అందంతో పాటు ఎలాంటి ఔట్ ఫిట్‌లో అయినా రాశి ఖన్నా భలేగా ఆకట్టుకుంటుంది. అందుకే రాశి ఖన్నా ఎప్పుడు ఏ ఫోటోలు షేర్ చేసినా కూడా ఆకట్టుకుంటూ ఉంది. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి ఫోటోలు చూసినప్పుడు స్టార్ హీరోలు ఈమెకు ఆఫర్లు ఇవ్వకుండా తప్పు చేశారు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెల్సిందే. పవన్ సినిమాలో సెకండ్ హీరోయిన్ అయినప్పటికీ మంచి గుర్తింపు ఉంటుంది. అందుకే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా తర్వాత తప్పకుండా తెలుగులో రాశి ఖన్నాకు స్టార్ హీరోల నుంచి ఆఫర్లు వస్తాయి అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో బాలీవుడ్‌లో ఈమె సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఈమె చేతిలో రెండు హిందీ సినిమాలు ఉన్నాయి. ఆ సినిమాలు హిట్ అయితే ఉత్తర భారతంలో కూడా కొన్నాళ్ల పాటు రాశి ఖన్నా సందడి కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా తప్పకుండా రాశి ఖన్నా ఆకట్టుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## 'కాంత'తోనే నా అసలు ప్రయాణం

సినీ పరిశ్రమలో చాలామంది నటీనటుల కెరీర్లు ఆసక్తికరంగా మొదలవుతాయి. కొంతమంది మొదట ఒక సినిమాకు సైన్ చేస్తారు కానీ వేరే సినిమా ముందుగా విడుదలై ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఇలాంటి పరిస్థితి ఇప్పుడు నటి భాగ్యశ్రీ బోర్సేకి కూడా ఎదురైంది. తెలుగు ప్రేక్షకులకు ఆమె "మిస్టర్ బచ్చన్" సినిమాతో పరిచయమవుతున్నా, వాస్తవానికి ఆమె సైన్ చేసిన మొదటి తెలుగు సినిమా అది కాదు. భాగ్యశ్రీ మాట్లాడుతూ, "నేను తొలిసారి విన్న సౌత్ సినిమా కథ కాంత. ఇదే నేను సైన్ చేసిన మొదటి సినిమా కూడా. కానీ కొన్ని కారణాల వల్ల షూటింగ్ కొంత ఆలస్యమైంది. ఆ గ్యాప్‌లోనే నా మరో రెండు సినిమాలు పూర్తయ్యి రిలీజ్ అయ్యాయి." అని చెప్పింది. భాగ్యశ్రీ నటించిన "కాంత" చిత్రం ప్రస్తుతం రిలీజ్‌కి సిద్ధమవుతోంది. ఈ సినిమా ఒక పీరియడ్ డ్రామా కాగా, దీనిని సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, రాణా దగ్గుబాటి, సముద్రఖని ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ పోషించిన పాత్ర పేరు 'కుమారి'. ఈ పాత్ర తనకు చాలా దగ్గరగా ఉందని ఆమె చెప్పింది. "నేను కుమారిగా చాలా కాలం జీవించాను. నిజంగా ఆమె పాత్రలో నా వ్యక్తిత్వం కూడా కలిసిపోయింది. ఆమె అంటే నేనే అనిపిస్తుంది. నా ఆలోచనలు, నా స్వభావం చాలా వరకు కుమారిలా ఉంటాయి." అని ఆమె భావోద్వేగంగా చెప్పింది. సినిమా ఆలస్యం కావడం తాను ఊహించలేకపోయానని, కానీ ఆ ప్రయాణం విలువైనదని కూడా భాగ్యశ్రీ తెలిపింది. "కొన్నిసార్లు అసలు ఈ సినిమా పూర్తి అవుతుందా అన్న సందేహం వచ్చేది. కానీ ఇప్పుడు చూస్తుంటే దేవుడి టైమింగ్ అద్భుతంగా ఉందని అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ముఖ్యమైన అవకాశం. నటిగా నా ప్రతిభను చూపించేందుకు ఇది సరైన సినిమా." అని చెప్పింది. భాగ్యశ్రీ మాట్లాడుతూ, సినిమా రంగంలో మహిళలకు పూర్తిగా తమ ప్రతిభను చూపించే అవకాశాలు తక్కువగా వస్తాయని, కాంత మాత్రం తనకు ఆ అవకాశం ఇచ్చిందని పేర్కొంది. "ఈ సినిమాలో నేను ఎంత కష్టపడి పనిచేశానో, పాత్రలో పూర్తిగా మునిగిపోయానో ప్రేక్షకులు గమనిస్తారు." అని తెలిపింది. మొత్తానికి, కాంత సినిమా భాగ్యశ్రీ కెరీర్‌లో ఒక మలుపుగా నిలిచే అవకాశముంది. ఈ చిత్రం ద్వారా ఆమె నటిగా తన పూర్తి టాలెంట్ ను నిరూపించుకోవాలని ఆశిస్తోంది.

# విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం కృషి



## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఎంపిడిఓ మధుసూదన్‌తో కలిసి సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో నిర్మాణ దశల వారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో తాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## పోలీస్ పీఆర్ఓలకు డీజీపీ ప్రశంసా పత్రాలు

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర డీజీపీ డా.శివధర్ రెడ్డి చేతుల మీదుగా పోలీస్ శాఖ పిఆర్ఓలు గురువారం ప్రశంసా పత్రాలు అందుకున్నారు. హైదరాబాద్‌లో పోలీస్ శాఖ పిఆర్ఓలకు వృత్తి నైపుణ్యత స్థాయి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించగా నిర్మల్ జిల్లాకు చెందిన నిర్మల్ జిల్లా ఎస్పీ పీఆర్వో నరిమెట్ల వంశీ, సోషల్ మీడియా ఇన్‌చార్జి రామ్ పవన్ కుమార్ తమదైన ప్రతిభను చాటుకొని డిజిపి శివధర్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రశంస పత్రాలు స్వీకరించినట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అనేక మేలుకోలను నేర్చుకోవడం జరిగిందని ఇటువంటి శిక్షణలు తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ప్రశంస పత్రాలు అందుకున్న పిఆర్ఓలను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

## గడిజిటల్ లిటరసీపై అవగాహన కలిగి ఉండాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
విద్యార్థుల్లో కృత్రిమ మేధ, సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ లిటరసీ మీద అవగాహన కల్పించాల్సిన పూర్తి బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉన్నదని, ప్రతి ఉపాధ్యాయుడు ఆధునిక బోధన పద్ధతులు ఉపయోగించి, డిజిటల్ టూల్స్ ద్వారా విద్యా బోధన చేసి విద్యార్థుల్లో విజయగాహన, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలని తెలంగాణ మోడల్ స్కూల్ ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ డివిజన్‌లోని వివిధ పాఠశాలల గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. గణితంలో కోడింగ్, డేటా సైన్స్, భౌతిక శాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిజికల్ కంప్యూటింగ్ అంశాలు విద్యార్థులకు బోధించాలని ఈ అంశాలకు సంబంధించి ఈ మూడు రోజుల శిక్షణను ఉపాధ్యాయులందరూ సద్వినియోగపరచుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు శ్యాంసుందర్, శ్రీనాథ్, రవికుమార్, రాజనర్సు బాబు, పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో పనిచేస్తున్న సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలని గురువారం టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేకు సంబంధించిన పరికరాలు మంజూరు చేయాలని, సర్వేకు అవసరమైన డీజీపీఎస్ రోవర్స్, ల్యాప్ టాప్స్, ప్రింటర్స్ మంజూరు చేయాలని కోరారు.



## ప్రజా సంఘాల పోరాట ఫలితమే శ్రావణి కుటుంబానికి పరిహారం

**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
దహేగం మండలంలో గత నెల 18న కుల దురహంకార హత్యపై ప్రజాసంఘాలు దపలవారీగా పోరాట ఫలితంగానే జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి శ్రావణి కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఒక లక్ష రూపాయలు నగదు, నాలుగు లక్షల 12500 వేల రూపాయలు ప్రొసీడింగ్ కాపీలను శ్రావణి కుటుంబ సభ్యులకు అందజేశారు. మహిళా సంఘాల ద్వారా ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడం కోసం ప్రయత్నం చేస్తాము మరణించిన శ్రావణి చిన్న తమ్ముడికి గురుకుల పాఠశాలలో చదువుకోవడానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ నెల 22వ తేదీన శ్రావణి కుటుంబానికి మరిన్ని డిమాండ్ ల సాధన కోసం కుటుంబానికి 5 ఎకరాల భూమి, ఒకరికి ఉద్యోగం, 25 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజానీకం తరలివచ్చి శ్రావణికి కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు గెడం, టికానంద్, గుడిసెల కార్తీక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ ఉన్నారు.



## అధిక సాంద్రత పత్తితో మంచి దిగుబడి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ



**నెన్నెల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
అధిక సాంద్రత విధానం తో పత్తి సాగు చేస్తే తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు సాధించి లాభాలు గడించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ అన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని బొప్పారంలో గురువారం అధిక సాంద్రత పత్తి సాగు క్షేత్ర పరిశీలన దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఏవో మాట్లాడుతూ తేలికపాటి నే లల్లో సైతం ఆధునిక పద్ధతిలో సాగు చేస్తే 30 శాతం దిగుబడి పె రుగుతుందన్నారు. పత్తిని రెండుమూడు సార్లు కాకుండా ఒకేసారి ఏ రుకోవచ్చున్నారు. పంట తొందరగా చేతికి వస్తుందని, ఆ తర్వాత ఇతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. సే ద్యశిభాగం శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ ఆధునిక పద్ధతిలో పత్తి సాగు విధానం, యాజమాన్య పద్ధతుల గూర్చి వివరించారు. అధిక మొక్క ల వల్ల ఆశించిన దిగుబడులు పొందంతో పాటు నేలసారాన్ని కాపా డుకోవచ్చున్నారు. ఖర్చులు సైతం చాలా వరకు తగ్గుతాయన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ నాగరాజు మెడిక్యాటో పిచికారి గూర్చి వివరించారు. పోషక లోపాలు, కీటక, వ్యాధి లక్షణాల తేడాల గూర్చి చెప్పారు. సమగ్ర పోషక నిర్వహణ, యాంత్రిక పత్తి కోతలపై అవ గాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, సాద్వి, మండల వ్యవసాయ అధికారి పుప్పాల సృజన, ఏఈవో రామ్‌చందర్ పాల్గొన్నారు.



## పోచమ్మ తల్లికి హంపి పీఠాధిపతి పూజలు

**సారంగాపూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
సారంగాపూర్ మండలంలోని అడెల్లి గ్రామంలోని శ్రీ మహా పోచమ్మ అమ్మవారి ఆలయంలో జగద్గురు హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధ్యారణ్యభారతి స్వామి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణ శిలలతో ఆలయం అద్భుతంగా నిర్మించబడిందని ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు స్వామి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ భోజగౌడ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో గురువారం మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మంత్రిని సన్మానించారు. దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.



# వైద్యుల నిర్లక్ష్యం.. శిశువు మృతి

- మంచిర్యాల మాత శిశు ఆరోగ్య కేంద్రంలో ఘటన
- వైద్యులపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్





**మంచిర్యాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
పండంటి బిడ్డకు జన్మనిచ్చే ఆ తల్లి మొఖం అప్పటివరకు చిరునవ్వుతో మురిసిపోయింది. పుట్టిన బిడ్డ చనిపోయిందని తెలిశాక తల్లి గుండె తల్లడిల్లిపోయింది. ఈ విషాదకర ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శస్త్ర చికిత్స చేయడంలో ఆలస్యం కావడంతో శిశువు మృతి చెందినట్లు బాధితులు ఆరోపించారు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొండంపేట్ గ్రామానికి చెందిన కరివేద. సరిత అనే గర్భిణీ నొప్పులు రావడంతో బుధవారం జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి బేబీ పల్స్ రేట్, హార్ట్ బీట్ బాగానే ఉందని చెప్పారన్నారు. ఆపరేషన్ అవసరంలేదని, నార్మల్ డెలివరీ అవుతుందని చెప్పి సాయంత్రం వరకు పట్టించుకోలేదన్నారు. నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయండి అంటూ వైద్యులను సైతం మా అమ్మ వేడుకున్నట్లు తెలిపారు. దీంతో అధిక నొప్పులతో బాధపడుతున్న పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయాలంటూ వైద్యులను బ్రతిమిలాడడంతో సాయంత్రం వరకు ఆపరేషన్ చేయకుండా నాలుగు గంటలపాటు ఆలస్యం చేశారని సరిత భర్త సాయిరాం ఆరోపించాడు. రాత్రి 8. 40 గంటల ఆపరేషన్ చేసి శిశువు మరణించిందని చెప్పినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పుట్టిన బిడ్డ కడుపులోనే మరణించిందని కుటుంబీకులు ఆరోపించారు. ఇంకా ఆలస్యం జరిగితే తల్లి ప్రాణానికి కూడా ప్రమాదం జరుగుండేదన్నారు. ఈ విషయంపై ఆసుపత్రిలో న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. సూపరింటెండెంట్ వేదవ్యాస్‌ను బాధిత కుటుంబ సభ్యులు వైద్యులపై చర్యలు తీసుకోవాలని కన్నీరు మున్నేరుగా విలపించారు. ఉదయం నుండి తన భార్య నొప్పులతో బాధపడుతుంటే వైద్యులు పట్టించుకోకుండా కాలాయాపన చేశారనివిలపించాడు. తన భార్యకు ఏదైనా జరిగితే ఆసుపత్రిలోనే సూసైడ్ చేసుకుంటానని ఆసుపత్రి సూపరింటెండెంట్ వద్ద గోడు వెళ్లబోసుకున్నాడు. ఇంకా ఆ శిశువు చనిపోయిన విషయం తన భార్యకు తెలియదని అన్నాడు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ బిజెపి నాయకులు ఆసుపత్రికి చేరుకొని సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**ఇలాంటి పరిస్థితి ఎవరికి రావద్దు...**
ఆస్పత్రిలో వైద్యులు ఆసుపత్రికి వచ్చే వారితో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని సాయిరాం తల్లి ఆగ్రహం వ్యక్తం చేసింది. మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని మండిపడింది. తమ కోడలు నొప్పులతో బోరున విలపిస్తుంటే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులను కఠినంగా శిక్షించాలని కన్నీటి పర్యంతమయ్యింది. మాకు జరిగినటువంటి ఈ ఘోరం ఇంకెవరికి జరగకూడదని ఆవేదన వ్యక్తం చేసింది. ఉదయం ఆపరేషన్ చేస్తే పుట్టిన బిడ్డ బతికి ఉండేదని ఏ తల్లి, బిడ్డకు ఇలాంటి పరిస్థితి రాకూడదని బాధను చెప్పుకుంది. ఆస్పత్రి వైద్యులు, పోలీసులు మరణించిన శిశువు ను మార్చురీలో ఉంచి పోస్టుమార్టం చేస్తే తప్పే మృతికి గల కారణం చెప్పలేం అనడంతో మృతి చెందిన పసి గుడ్డుకు పోస్టుమార్టం అవసరం లేదని బాధిత కుటుంబ సభ్యులు రాత్రి ఆసుపత్రి నుండి ఇంటికి వెళ్లిపోయారు.

**బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదు సూపరింటెండెంట్ వేదవ్యాస్**
ఆసుపత్రిలో శిశువు మృతి పై ఫోన్‌లో వివరణ కోరగా నిజమే అవును అని సమాధానం ఇచ్చారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయంపై ఇన్ ఫార్మల్‌గా విచారణ చేస్తున్నాము. డిపార్ట్మెంట్‌తో ఒక సమావేశం నిర్వహిస్తాం ఎలాంటి ట్రీట్మెంట్ ఇచ్చారని చర్చిస్తాం అన్నారు. పేషంట్లతో మాట్లాడే విధానంపై కూడా నర్సులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.



### రాజ్యాంగ దినోత్సవానికి
## కలెక్టర్‌కు ఆహ్వానం

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
26న ఆదిలాబాద్ పట్టణంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు భారతీయ బౌద్ధ మహా సభ రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రజ్ఞ రత్నజాడే తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం జిల్లా పాలనాధికారి రాజర్షి షాకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తప్పకుండ కార్యక్రమానికి రావాలన్నారు.

### ముగిసిన ఉమ్మడి
## జిల్లా స్థాయి క్రీడా పోటీలు




**లక్షెట్టిపేట, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి అండర్ -14, అండర్-19 క్రీడ పోటీలకు ముఖ్యఅతిథిగా మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రెటరీ జి.తిరుపతి గురువారం హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు, క్రీడలు అత్యంత కీలకమన్నారు. క్రీడలు విద్యార్థుల యొక్క శారీరక సామర్థ్యాలను, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 13 బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీలలో అండర్ 19 విభాగంలో లక్షెట్టిపేట్ బాలుర కళాశాల విజయం సాధించగా, అండర్ 14 విభాగంలో జాంగాన్ బాలుర పాఠశాల విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి శ్రీధర్, ప్రిన్సిపల్ మంగ, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఏటీపీ తిరుమల్, డిప్యూటీ వార్డెన్ వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## యువకుడి బలవన్మరణం

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలోని కోలీపుర కాలనీకి చెందిన మొహమ్మద్ మైసన్ చావుష్(29) అనే యువకుడు ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. మెకానిక్‌గా పని చేసే అతను గురువారం ఉదయం ఈద్గా గోడ వెనుక ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. అటువైపు వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి ఈద్గా నిర్వాహకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. అనారోగ్య కారణాలతోనే మొహమ్మద్ మైసన్ చావుష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.





# ఆర్టీసీ బస్సు టైరుల్లో నుంచి పొగలు

- తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికుల సురక్షితం



**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ఆర్టీసీ బస్సు టైరుల్లో నుండి ఒక్కసారిగా పెద్దఎత్తున పొగలు వెలువరడంతో డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పి, ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల... గురువారం ఉదయం ఆదిలాబాద్ నుండి నిర్మల్‌కు వెళ్లిన ఆదిలాబాద్ డిపో ఆర్టీసీ(అద్దె బస్సు) తిరిగి ఆదిలాబాద్ వస్తున్న క్రమంలో దేవాపూర్ చెక్ పోస్ట్ సమీ పంలో జాతీయ రహదారిపై బస్ వెనుక టైరులో నుండి ఒక్కసారిగా పొగలు వెలువడ్డాయి. దట్ట మైన పొగలను గమనించిన ప్రయాణికులు భ యాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి మంటలు చెలరేగక ముందే బస్సును అక్కడనే నిలిపివేశాడు. బస్సులోని ప్రయాణికులందరినీ కిందికి దింపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పగా, ప్రయాణికులందరినీ ఇతర బస్సులో ఆదిలాబాద్‌కు తరలించారు. బస్సుకు బ్రేక్ లైనర్ల సెట్టింగ్ ఎక్కువ సెట్టింగ్ కావడంతో టైర్‌లోని బ్రేక్ లైనర్ల మధ్య రాపిడి పెరిగి పొగ వెలువడిందని ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు.

# పంట విక్రయాల్లో బయోమెట్రిక్ తొలగించాలి

### కాంటా చేసిన అధికారులే
### బాధ్యత వహించాలి.. మొక్కజొన్న రైతుల డిమాండ్



**ఇంద్రవెల్లి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల కొనుగోలు కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధనతో మొక్కజొన్న రైతులు అవస్థలు పడుతున్నారు. పంట అమ్మిన తర్వాత కూడా లోడింగ్ చేసే వరకు ఉండాల్సి రావడంతో ఆందోళన చెందుతున్నారు. చలిలో వణుకుతూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అమ్మే వరకే మా బాధ్యత ఉండాలని, అమ్మిన తర్వాత అధికారులే చూసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా.. కొనుగోలు కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన బయోమెట్రిక్‌లో వేలిముద్రలు రావడం లేదని ఆరోపించారు. తమ బంధువుల పట్టాల ద్వారా పంట ఉత్పత్తులను అమ్ముకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టి సారించి.. కాంట వేసిన పంటను లోడింగ్ చేసే వరకు రైతులను ఉంచకూడదని.. బయోమెట్రిక్ విధానాన్ని తొలగించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



### లక్ష్మీ నారాయణ స్వామి
## ఆలయ బ్రహ్మోత్సవాలు
### దర్శించుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

**జైనథ్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
జైనథ్‌లోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర వేడుకల్లో భాగంగా స్వామి వారిని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించాగా, ఆలయ పూజారి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యాలయంలో బీజేపీ నేతలు కరుణాకర్ రెడ్డి, రాకేష్‌రెడ్డి, రాందాస్, రమేష్, అశోక్ రెడ్డి, విజయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుడు శంకర్
## మరణం పార్టీకి తీరని లోటు

**బెజ్జూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**
చింతలమానేపల్లి మండలం బాలాజీ అను కోడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బోర్కూట్ శంకర్ హఠాత్తుగా మరణించడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. గురువారం శంకర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి శంకర్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు.



## సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని
# కొత్త ఆవిష్కరణలు చేయాలి

**కాసిపేట, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిజ్ఞాస మొబైల్ సైన్స్ ఇన్‌చార్జి లక్ష్మణ్ నేతృత్వంలో సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 6 నుంచి 10 వ తరగతి చదివే విద్యార్థులందరికి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జీవ శాస్త్ర, వివిధ రకాల సైన్స్ ప్రయోగాలు విద్యార్థుతోనే చేయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాథోడ్ రమేష్ మాట్లాడుతూ నేటి నవీన సమాజంలో విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని అనేక కొత్త ఆవిష్కరణలు చేసి సైంటిస్ట్‌గా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ బాబు, లచ్చన్న, రాజేష్, పద్మ కుమారి, రమణయ్య, సులోచన, నిర్మల, మహేష్, కృష్ణ, రజిత విద్యార్థులు పాల్గొన్నారు.

## దాడులు ప్రోత్సహించడాన్ని
# మానుకోవాలి : కాంగ్రెస్ నాయకులు



**సోనాల, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కాంగ్రెస్ కార్యకర్తలపై నిన్న జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్ పేర్కొన్నారు. సోనాల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో వ్యక్తులపై దాడుల సంస్కృతిని ఎమ్మెల్యే ప్రోత్సహించటం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్య యుతంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

# ధర్మ యుద్ధ సభకు తరలిరావాలి



**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 23వ తేదీన ఉట్నూరులో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగే 'ధర్మ యుద్ధ సభ'కు ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె గురువారం ఆసిఫాబాద్ పట్టణంలో బహిరంగ సభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్ నిరంతరం జరుగుతుందని, దీని కోసం ఆదివాసీ సంఘాలుమద్దతు తెలపాలన్నారు.

# అధిక వడ్డీ వసూలు చేసిన వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో అధిక వడ్డీ వసూలు చేస్తున్న మణికంఠ మ్యాన్‌పవార్ ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుడు అందే క్రాంతి కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సమాచారం రావడం తో గురువారం తనిఖీ చేపట్టగా, 13 చెక్కులు, 3 ప్రా మిసరీ నోట్లు, రెండు డాక్యుమెంట్లు లభిం చినట్లు పేర్కొన్నారు. ఆయనపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యం

## బీసీ జేఏసీ చైర్మన్ రమేష్ రూపునర్

**ఆసిఫాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించడమే తమ లక్ష్యమని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రమేశ్ అన్నారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మదీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. బీసీ జేఏసీ చైర్మన్ రూపు నార్ రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ చేసి బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయకపోతే తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమం జరుగుతుందని, ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడిపెంచాలి.. వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బీసి రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలతో సమన్వయం చేసుకొని పార్లమెంటు స్తంభింపజేసి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేదాకా పార్లమెంట్ సమావేశాలు వేదికగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం బీసీలు తరపున రాజకీయ పోరాటం కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీసీల మాట పెడచెవిన పెట్టి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామంటే బీసీలు తాడోపేడో తెలుసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేసి, ఈడబ్ల్యూఎస్ జనాభా కంటే ఎక్కువగా 10 శాతం రిజర్వేషన్లు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పెట్టి కేంద్రానికి పంపితే రాష్ట్రపతి గవర్నర్ పెండింగ్ పెట్టారు. రెడ్డి జాగృతి నాయకులు హైకోర్టును సుప్రీంకోర్టును ఆశ్రయించి తినే అన్నంలో మన్ను కలిపినట్లు చేశారని మండిపడ్డారు. రాజ్యాంగ సవరణ చేసి బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయకపోతే తెలంగాణ ఉద్యమ




తరహాలో ఈ నెల 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, ఈనెల 18న ఎంపీలతో ములాఖత్, 23న డిసెంబర్ మొదటి వారంలో పార్లమెంటు ముట్టడి, డిసెంబర్ మూడో వారంలో బస్సు యాత్ర జనవరి 4న వేలవృత్తులు - కోట్ల గొంతులు అనే నినాదంతో హైదరాబాదులో భారీ బహిరంగ సభ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, జాతీయ ఉపాధ్యక్షులు రేగుంట కేశవ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ జేఏసీ కోఆర్డినేటర్ ప్రణయ్ కుమార్, బీసీ జేఏసీ వైస్ చైర్మన్లు గాజుల జక్కన్న, పొన్న రమేష్, మేరాజ్ భాయ్, వైరాగడి మారుతి పటేల్, నికోడె రవీందర్ అడ్వకేట్, జై భీమ్ సంఘ నాయకుడు ఝాడే అశోక్, గంగపుత్ర సంఘ నాయకుడు మోరేశ్వర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘ నాయకుడు జూలూరి శంకర్,అఖిలభారత మాలిమహా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగోశే శంకర్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గురునులే మెంగజీ గారు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లోబడే లహు కుమార్, ఆరే సంక్షేమ సంఘం నాయకుడు బొట్టుపల్లి శ్యామ్ రావు, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ, సండే నామ్ దేవ్, నికోరే హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడపొద్దు



## నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల
## విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి న్యాయమూర్తి జైలు శిక్ష వేసిన సంఘటన నిర్మల్ జిల్లాలో జరిగింది. జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా దిలావర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌట్ల గ్రామా నికి చెందిన భీమన్న, నర్సాపూర్ (జి) పోలీస్ స్టేషన్ పరిధిలోని కుస్లి గ్రామానికి చెందిన కండెల రాజేశ్వర్, నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మెస్రం మనోహర్‌లు మద్యం సే వించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా వారిని పోలీసులు గురువారం కోర్టులో హాజరు పరచగా ద్వితీయ శ్రేణి ప్రత్యేక న్యాయమూర్తి నర్సయ్య భీమన్నకు 10 రోజులు, మెస్రం మనోహర్ కు 6 రోజులు, కండెల రాజేశ్వర్‌కు 5 రోజుల జైలు శిక్ష వేధించినట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలకు హాని కలిగించడం తీవ్రమైన నేరమని, ప్రతిరోజు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తనిఖీల్లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ



**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. ఖానాపూర్ మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే కార్యాలయ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కార్యాలయ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి, ప్రజలకు సేవలు అందించడానికి కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని అన్నారు. నూతన కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యేలోపు అధికారులు విధులు నిర్వహించడానికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసిల్దార్ సుజాత, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, ఈఈ పిఆర్ చందు జాదవ్, సంబంధిత అధికారులు, సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద పులి సంచారం

**పెంబి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని తాడిగూడ అడవుల్లో పెద్ద పులి సంచారం ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నది. గురువారం తాటిగూడ సెక్షన్ పరిధిలోని జిడి మాల్య గ్రామ శివారులో పులి పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్వో రమేశ్‌రావు మాట్లాడుతూ.. పొలాలకు వెళ్లేటప్పుడు, పత్తి ఏరేటప్పుడు గుంపులు గుంపులుగా వెళ్లాలని సూచించారు. పశువుల కాపరులు, ఇతరులు అడవుల్లోకి ఎవరు వెళ్లొద్దని సూచించారు. పులి అలజడి కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు.

## పెద్దపులి ఆచూకీ కోసం
# సీసీ కెమెరాలు ఏర్పాటు

**సిరికొండ, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

సిరికొండ మండలంలోని సాత్ మోరి గ్రామ శివారులో పులి సంచారం కలకలం రేపింది. మేస్రం బొజ్జుకు చెందిన ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఘటనా స్థలాన్ని ఇచ్చోడ రేంజ్ అధికారి స్వామి, సిరికొండ సెక్షన్ ఆఫీసర్ చంద్ర రెడ్డి, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.





# మందుల్లేవ్.. మధుమేహంతో జాగ్రత్త!

## సైలెంట్ కిల్లర్..

- వేగంగా వ్యాప్తి చెందుతున్న షుగర్ వ్యాధి
- రోజురోజుకు పెరుగుతున్న మధుమేహ బాధితులు..
- నియంత్రణ ఒక్కటే మార్గం
- నేడు అంతర్జాతీయ డయాబెటిక్ డే

రక్తంలో గ్లూకోజ్ శాతం పెరిగిపోయి...పరిమితి కంటే అధికంగా ఉండడం వల్ల వచ్చేదే మధుమేహం. దీన్ని వైద్య భాషలో డయాబెటిస్ అంటారు. శరీరంలోని ప్రతి కణానికి గ్లూకోజ్ అవసరం. మనం తీసుకున్న ఆహారం జీర్ణమై గ్లూకోజ్‌గా మారి రక్తం ద్వారా కణాలన్నింటికి సరఫరా అవుతుంది. రక్తంలోని గ్లూకోజ్‌ను కణాలు సరిగ్గా వినియోగించుకోవాలంటే ఇన్సులిన్' అనే హార్మోను అవసరం. ఈ హార్మోన్‌ను శరీరంలోని క్లోమం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉత్పత్తి చేయలేకపోతుంది. మరికొందరిలో ఉత్పత్తి చేసినా అది సమర్థవంతంగా వినియోగం కాదు. తద్వారా రక్తంలోని గ్లూకోజ్ కణాలకు చేరలేక రక్తంలోనే ఉండిపోతుంది. గ్లూకోజ్ శరీరంలో ఉండిపోవడాన్ని మధుమేహం అంటారు. జీర్ణాశయం వెనకాల అడ్డంగా అరంగుళం అవయవమే క్లోమం. క్లోమం రెండు కీలకమైన పనులు చేపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కావడానికి అవసరమైన కొన్ని ఎంజైమ్‌లను ఉత్పత్తి చేస్తుంది. రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా పెరిగిపోకుండా, లేక తగ్గకుండా చూసేందుకు అవసరమైన ఇన్సులిన్, గ్లూకోగాన్ హార్మోన్లు తయారు చేస్తాయి. మధుమేహం ఎప్పుడు వచ్చిందో కూడా తెలియకపోవచ్చు. అందుకే 30ఏళ్లు నిండిన వాళ్లంతా పరీక్షలు చేయించుకుంటే మంచిది.

## మధుమేహానికి మందులు లేవు..! నియంత్రణే మార్గం

మధుమేహం వ్యాధి నివారణకు ఇప్పటి వరకు ఎలాంటి మందులు లేవు. ప్రధానంగా స్వీట్లు, ఐస్‌క్రీమ్‌లు, బర్గర్లు తదితర జంక్‌ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల స్థూలకాయం ఏర్పడి తద్వారా ఈ వ్యాధి సంక్రమించే అవకాశముంది. ఇది కేవలం వృద్ధులకు మాత్రమే వస్తుందన్నది భ్రమే. చిన్నతనంలోనే ఊబకాయం గలవారు యుక్తవయసులో మధుమేహం బారిన పడుతున్నారు. దీని నివారణకు పటిష్టమైన వ్యూహాన్ని అవలంబించాలి. ఆరోగ్యకరమైన ఆహారంతో బరువును అదుపులో ఉంచుకోవడంతో పాటు శారీరక శ్రమకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## మధుమేహం లక్షణాలు

- అతి మూత్రం, అధిక దాహం.
- ఆహారం బాగానే తీసుకుంటున్నా బరువు తగ్గిపోవడం.
- చేతులు, కాళ్లు, పాదాలకు తిమ్మిర్లు లేదా మంట.
- జననేంద్రియాలు, శరీరమంతా దురద.
- దెబ్బలు, గాయాలు మానకపోవడం.
- తరచూ దంతాల సమస్యలు, చిగుళ్ల వ్యాధులు వేధిస్తుంటాయి.

## రెండు రకాలు..

టైప్ 1: ఈ రకం మధుమేహం బాధితుల్లో క్లోమం ఇన్సులిన్‌ను చాలా తక్కువ మోతాదులో ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల టైప్ 1 రకం మధుమేహం బాధితులు తప్పనిసరిగా రోజు కృత్రిమంగా ఇంజక్షన్ల ద్వారా ఇన్సులిన్ తీసుకోవాలి. చిన్న వయసులో మధుమేహం బారిన పడిన వారిలో అధికంగా ఉంటుంది.

టైప్ 2: ఈ రకం మధుమేహం వందకు 90 శాతం మందిలో కనిపిస్తుంది. ఈ మధుమేహం 30-40 ఏళ్లు దాటిన తర్వాత ప్రారంభమయ్యే సమస్య. ఈ రకం మధుమేహ బాధితుల్లో ఎంతో కొంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. కానీ, ఈ ఇన్సులిన్ సమర్థవంతంగా పని చేయదు. ఈ రకం మధుమేహం ఉన్న వారు పూర్తిగా ఇన్సులిన్‌పై ఆధారపడాల్సిన అవసరం లేదు. ఈ రకం మధుమేహం గర్భిణీలకు కూడా వచ్చే అవకాశం ఉంటుంది. వీరిలో ప్రసవం తర్వాత మధుమేహం తగ్గిపోవచ్చు. ప్రసవం తర్వాత తగ్గిన వారిలో ఎప్పుడైనా తిరిగి రావచ్చు.

## పిల్లలకూ వ్యాధి లక్షణాలు..



నేడు పిల్లలకు సైతం మధుమేహం బెంగ పట్టుకుంది. ఆడు తూ, పాడుతూ హాయిగా తిరగాల్సిన వయసులో వారు మధుమేహం బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 15ఏళ్ల లోపు పిల్లల్లో ఏటా 70వేల మంది టైప్ 1 మధుమేహం బారిన పడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆహారంలోని మార్పులే. జంక్‌ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల ఈ వ్యాధి బారిన పడుతున్నారు. వీటి వల్ల ఊబకాయం, అధిక బరువు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. తద్వారా పిల్లలు మధుమేహం బారిన పడుతున్నారు. వ్యాధి బారిన

## నిర్ధారణ ఇలా...

మధుమేహం నిర్ధారణకు రక్తపరీక్ష కీలకమైంది. రక్త పరీక్షలు రోజులో మూడు రకాలుగా చేస్తారు.

### ఉదయం వేళ..

ఉదయం నిద్రలేచిన తర్వాత అరగంటలోపు ఏమి తినక ముందు చేసే రక్త పరీక్ష ఫాస్టింగ్ బ్లడ్ షుగర్. ఇది 125 కంటే ఎక్కువగా ఉంటే మధుమేహం ఉన్నట్లు నిర్ధారిస్తారు. పరీక్షను ఉదయం 7నుంచి 8గంటలలోపు చేయడం ఉత్తమం.

### భోజనం చేసిన తరువాత..

భోజనం తర్వాత రెండు గంటలకు చేసిన రక్త పరీక్ష పోస్ట్ ప్రాండియల్ బ్లడ్‌షుగర్. దీనిలో గ్లూకోజ్ శాతం 200 మిల్లీ గ్రాములు ఉంటే మధుమేహం ఉన్నట్లు గుర్తిస్తారు.

### రోజులో ఎప్పుడైనా..

రోజులో ఏ సమయంలోనైనా రక్తంసేకరించి పరీక్షించడాన్ని ర్యాండమ్ పరీక్ష అంటారు. దీనిలో గ్లూకోజ్ శాతం 200మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ఉంటే మధుమేహం ఉన్నట్లు గుర్తిస్తారు. దీన్ని అధికంగా మధుమేహం ఉన్న వారికి అదుపులో ఉన్నదో లేదో తెలుసుకోవడానికి చేపడతారు.





## కల్లెం వేయకపోతే..

మధుమేహాన్ని అదుపులో ఉంచుకోకపోతే అనేక సమస్యలు వస్తాయి. ప్రధానంగా రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతింటుంది. యుక్త వయసులోనే మధుమేహం వచ్చినప్పుడు దానిని అదుపు చేయడం కోసం శ్రద్ధ వహించాలి. మధుమేహం బాధితులను చాలా ఎక్కువగా పీడించేది ఇన్‌ఫెక్షన్లు. వీటిలో క్షయ, చర్మవ్యాధులు, అనేక రకాలైన ఇన్‌స్పెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రక్తంలో చక్కెర శాతం ఎక్కువగా ఉండడం వల్ల రక్తనాళాలు త్వరగా దెబ్బతింటాయి. తద్వారా చిన్న రక్తనాళాలు దెబ్బతినడంతో కంటి చూపుపోయి అంధత్వం వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే మూత్రపిండాలు దెబ్బతిని చివరికి పూర్తిగా చెడిపోతాయి. పెద్ద రక్తనాళాల సమస్యల్లో ప్రధానమైనవి గుండెపోటు, పక్షవాతం, పాదాల సమస్యలు ఏర్పడతాయి. దీర్ఘకాలం పాటు మధుమేహం అదుపులో లేకపోతే శరీరంలోని నాడులు దెబ్బతింటాయి. తద్వారా నొప్పి, స్పర్శ తగ్గిపోవడం జరుగుతుంది.



# రైస్ మిల్లర్ల మాయాజాలం

- సీఎంఆర్ ధాన్యంలో రైస్ మిల్లుల గోల్ మాల్ ■ రూ.6.22 కోట్ల ధాన్యం బస్తాలు మాయం..
- నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మిల్లుల్లో 2684 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం పక్కదారి
- వేలాది టన్నుల వడ్లనూ అమ్మేసుకున్నారు ■ కడెం ప్రాంతంలో సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్ళించిన మిల్లర్లు
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులతో వెలుగులోకి ■ కట్టా బాలాజీ రైస్ మిల్‌లో సోదాలు
- సదరు మిల్లు యజమానిపై చర్యలకు పౌరసరఫరాల శాఖకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక..
- రైస్ మిల్లర్లపై ప్రభుత్వానికి ఓ ప్రజాప్రతినిధి ఫిర్యాదు ■ నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లలో కలకలం

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

నిర్మల్ జిల్లాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల చేపట్టిన ఆకస్మిక దాడులతో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయల విలువ చేసే సీఎంఆర్ ధాన్యం దారిమళ్లినట్టు అధికారులు గుర్తించారు. నిర్మల్ జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో ధాన్యం బస్తాలు మాయం అయినట్లు గుర్తించారు. నిర్మల్ జిల్లా కడెం ప్రాంతంలో రైస్ మిల్లర్లు భారీగా సీఎంఆర్ ధాన్యాన్ని దారి మళ్ళించారనే విశ్వసనీయ సమాచారం అందడంతో కరీంనగర్ విజిలెన్స్ యూనిట్ ఈ నెల11వ తేదీన కట్టా బాలాజీ రైస్ మిల్‌లో సోదాలు నిర్వహించగా ఇందులో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి 2684 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం స్టాక్ దారి మళ్లించారని దీని విలువ 6.22 కోట్లు ఉంటుందని గుర్తించారు. సదరు మిల్లు యజమానిపై తదుపరి చర్యలు తీసుకునేలా పౌరసరఫరాల శాఖకు సమాచారం ఇచ్చారు. ధాన్యం దారి మళ్లిస్తున్నట్లు గుర్తిస్తే టోల్-ఫ్రీ నంబర్ 14432 కు ఫోన్ చేసి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్‌కు సమాచారం అందించాలని తెలంగాణ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ తెలిపారు. నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లలో కలకలం మొదలైంది. అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లకే మళ్లీ సీఎంఆర్ ధాన్యం ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ ఎత్తున అక్రమాలు జరిగినప్పటికీ రైస్ మిల్లర్ల విషయంలో చూసీచూడనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఓ మాజీ ప్రజాప్రతినిధి విజిలెన్స్ శాఖతోపాటు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులకు తాజాగా ఫిర్యాదు చేశారు. ఇక్కడ రైస్ మిల్లర్లు సకాలంలో బియ్యం అందించకుండా పెద్ద మొత్తంలో కాజేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి నిర్మల్ జిల్లాలో 13 రైస్ మిల్లులపై కేసులు నమోదయ్యాయి. తాజాగా నిర్మల్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ గణేష్ విజిలెన్స్ అధికారులతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఇప్పటిదాకా చర్యలు తీసుకోకపోగా మళ్లీ అక్రమార్కులకే సీఎంఆర్ ధాన్యం అప్పగించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆ రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.. నిర్మల్ జిల్లాలో భారీ ఎత్తున అక్రమాలు జరిగినప్పటికీ రైస్ మిల్లర్ల విషయంలో చూసీచూడనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఓ మాజీ ప్రజాప్రతినిధి విజిలెన్స్ శాఖతో పాటు పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులకు తాజాగా ఫిర్యాదు చేశారు. దీని వెనుక ఉన్న పెద్ద తలకాయలను పట్టుకొని చర్యలు తీసుకోవాలని చేసిన డిమాండ్ ఇప్పుడు నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లలో కలకలం రేపుతున్నది. రైస్ మిల్లులకు టార్గెట్లు ప్రతి సంవత్సరం సీఎంఆర్ బియ్యం ఇచ్చే విషయంలో పౌర సరఫరాల శాఖ రైస్ మిల్లులకు టార్గెట్లు ఇస్తుంది. దాని ప్రకారం కచ్చితంగా మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత బియ్యం ఎఫ్‌సిఐకి కచ్చితం ఎఫ్‌సిఐకి అందించాలిగా అందించాలి. కానీ ఇక్కడ జరుగుతున్న అక్రమాల కారణంగా రైస్ మిల్లర్లు సకాలంలో బియ్యం అందించకుండా పెద్ద మొత్తంలో కాజేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి నిర్మల్ జిల్లాలో 13 రైస్ మిల్లులపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇది పక్కన పెడితే అక్రమాలకు పాల్పడ్డ రైస్ మిల్లర్లకే మళ్లీ సీఎంఆర్ ధాన్యం ఇవ్వడంపై అనేక ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి విజిలెన్స్ అధికారులతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాల్సిన మిల్లర్లకే మళ్ళీ అందలం వేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెలలో మిల్లర్ల మాయాజాలంపై నిర్మల్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ గణేష్ విజిలెన్స్ అధికారులతో పాటు పౌరసరఫరాల శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మళ్లీ అక్రమార్కులకే సీఎంఆర్ దాన్యం అప్ప చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిల్లులను మూసివేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్రమాలకు పాల్పడ్డ మిల్లులకే సీఎంఆర్ ధాన్యం ఇస్తున్నారని దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. తాజాగా గురువారం నిర్మల్ జిల్లాల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల చేపట్టిన ఆకస్మిక దాడులతో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లలో కలకలం రేపుతున్నది.

# రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలి



**రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళిక - ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఇచ్చోడ, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అవలంభించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం మండలంలోని జాతీయ రహదారి 44 పై గత రెండు సంవత్సరాలలో అత్యధిక ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను అధికారులతో ప్రమాదాల స్థలాలను పరిశీలించి, గుర్తించి ప్రమాదాలు జరిగిన కారణాలు వాటి నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి అధికారులకు సూచించారు. రాత్రి సమయాలలో కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలన్నారు. వేగంగా వెళ్లే దారులలో వేగ నియంత్రణకు ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## 'పోలీసుల తీరును ఖండిస్తున్నాం'

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో పోక్సో నిందితుడి కోర్టు సరెండర్ నేపథ్యంలో పోలీసులు న్యాయవాదులపై దాడి చేసి కారును ధ్వంసం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నట్టు నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ మల్లారెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాదులతో కలిసి మాట్లాడారు. పోక్సో చట్టంలో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తిని నలభై రోజులపాటు పట్టుకోలేని పోలీసులు న్యాయవాది సమక్షంలో లొంగుబాటు సిద్ధమైతే న్యాయవాదిపై స్థానిక పోలీసులు దురుసుగా ప్రవర్తించాలని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు న్యాయవాదుల సంఘం ఆదురులో నిరసన తెలుపుతామని వెల్లడించారు.

## జోనల్ స్థాయి క్రీడా పోటీలు విద్యార్థుల ప్రతిభ

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్వహించిన గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలో నిర్మల్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు పిఈటి ముఖ్య రమేష్ తెలిపారు. కబడి వాలీబాల్ చెస్ అథ్లెటిక్ తదితర పోటీల్లో జిల్లాలోని వివిధ ఆశ్రమ గిరిజన పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఛాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారని తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థులకు జిల్లా గిరిజన సంక్షేమ అభివృద్ధి అధికారి డిడి అంబాజీ నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి

**మందమర్రి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోపారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టి పారిశుధ్యం మెరుగుపరచాలని మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ కోరారు. మండలంలోని వెంకటాపూర్, పొన్నారం, శంకరపల్లి గ్రామ పంచాయతీలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి, తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని, గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. ఈనెల 15 వరకు వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేసి,వెంటనే అన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్ లో కంపోస్ట్ ఎరువును తయారు చేయాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీలలో నీటి సరఫరా, శానిటేషన్‌కు సంబంధించిన 7 రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు కొండ్రు ప్రశాంత్, హరీష్, రాజేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతులకు ఊరట

**ఏడు క్వింటాళ్లపైనా పత్తి కొనుగోళ్లు**

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని కౌలు రైతులకు ఊరట లభించింది. ప్రస్తుతం రైతులు పండించిన పత్తిని ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తోంది. ఎకరాకు ఏడు క్వింటాళ్లకుపైగా దిగుబడి వస్తే దాన్ని అమ్ముకునేందు కు రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయితే ఈ నిబంధన సడలించినట్లు కలెక్టర్ రాజర్షిషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడు క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చిన రైతు లు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా పత్తి పంట పరిశీలన చేయిం చాలని పేర్కొన్నారు. సదరు ఏఈవో దిగుబడి ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో సంబంధిత కొనుగోలు కేంద్రానికి నేరుగా పంపిస్తారని తెలిపారు. ఈ నిర్ణయం జిల్లాలోని కౌలు రైతులకు ప్రయోజనం చేకూర్చనున్నట్లు పేర్కొన్నారు.

## ఆటో ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి

**మందమర్రి, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**



పట్టణంలోని బురదగూడం మదర్సా ఎదురుగా గల జాతీయ రహదారిపై ఆటో ట్రాలీ, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో తండ్రి మృతిచెందగా కుమారుడు గాయపడ్డారు. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొక్కలగుట్టకు చెందిన ఒళ్లపు నర్సయ్య తన కుమారుడు వెంకటేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం బొక్కలగుట్ట నుండి మంద మర్రికి వస్తుండగా బురద గూడెం మదర్సా సమీపంలోకి రాగానే రాంగ్ రూట్‌లో, అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఆటో ట్రాలీ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్య తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు.

## భూమి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

జగిత్యాల జిల్లా గౌడ కులస్తులకు ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నరస గౌడ్ అన్నారు. గురువారం నిర్మల్‌లో ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులకు కల్లు గీతా వృత్తి నిర్వహించుకున్నందుకు ఈత వనాల కోసం సర్వేనెంబర్ 51 లో 5 ఎకరాలు కేటాయించాలని ఆ భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే అన్ని జిల్లాల్లో పోరాటం చేస్తామని తెలిపారు.






# ప్రతి నీటి బొట్టు .. బంగారమే పొదుపుగా వాడుకుందాం

■ ప్రతీ నీటి బిందువు అమూల్యం ■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ■ ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణకు పునాది ■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

నీటి ప్రతి బిందువు అమూల్య మని, ప్రజల భాగస్వామ్యంతోనే స్థిరమైన నీటి వనరుల సంరక్షణ సాధ్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా నిర్వహించిన 'మన బడి-మన నీరు' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ కూడలి నుండి జడ్పీ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్న అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యూట్రీ గార్డెన్, ఇంకుడు గుంత, గిరిజన ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గది, వర్షపు నీటి నిల్వ గుంతలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ఆరంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ అత్యవసరమని, ప్రతి గ్రామం, ప్రతి పాఠశాలలో నీటి వనరులను కాపాడే దిశగా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు క్షీణిస్తున్న తరుణంలో వర్షపు నీటిని నిల్వచేసే ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, సోక్ పిట్‌లు నిర్మించాల







న్నారు. నీటి ప్రతి బిందువు అమూల్యం. ఈ రోజు మనం సంరక్షిస్తేనే రేపటి తరాలకు అందించగలుగుతా మని తెలిపారు. జిల్లాలో వర్షపాతం అధికంగా నమోదవుతున్నప్పటికీ నిల్వ నీటి వనరుల కొరత ఉందని, ఈ పథకం ద్వారా ప్రతి పాఠశాల స్థాయిలో అవగాహన సృష్టించి విద్యార్థుల ద్వారా కుటుంబాలకు సందేశం చేరవేస్తున్నామ న్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కమ్యూనిటీ సోక్ పిట్‌కు 18 వేలు, రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ యూనిట్‌కు 25 వేలు మంజూరు చేస్తున్నామని, నాణ్యతతో పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు నీటి ప్రాధాన్యం, వృథా కాకుండా వినియోగం, వర్షపు నీటి నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ప్రజలు వర్షాల కోసం కప్ప పూజలు, పాటల ద్వారా ప్రార్థించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని జాగ్రత్తగా వినియోగించడం అత్యంత అవసరమని తెలిపారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలు నిల్వ ఉండి పంటల సాగుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల సహకారమే ఈ కార్యక్రమ విజయానికి మూలం అన్నారు. జల్ సంచయ్-జన్ భాగీదారీ పథకం విజయవంతమైన అమలుకు గాను ఈ నెల 18న జిల్లా కలెక్టర్‌కు అవార్డు లభించనున్న సందర్భంగా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన చేసిన సాహిత్య సేవలను కొనియాడారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా రాబోయే దశాబ్దంలో నీటి కొరత సమస్యను అధిగమించవచ్చున్నారు. ప్రతి కొత్త ఇంటి నిర్మాణంలో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మన బడి-మన నీరు పోస్టర్ ను ఆవిష్కరణ చేసి, పాల్గొన్న వారందరూ "నీటి సంరక్షణ ప్రతిజ్ఞ" చేశారు. కార్యక్రమం ముగింపులో కవి అందెశ్రీకి రెండు నిమిషాల మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విజేతలకు ఛాంపియన్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్డిఓ రవీందర్, అంబాజీ, ఐటిడిఓ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతీ ప్రభుత్వ పథకం అర్హులైన పేదలకు అందిస్తాం




**నిర్మల్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
■ పేదల అభ్యున్నతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం
■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు, పథకాల అమలుపై సంబంధిత అధికారులు అందరితో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నిటిని అర్హులైన నిరుపేదలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు మార్గ నిర్దేశం చేస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల ఇంజనీరింగ్ ఏజెన్సీలో ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే గుత్తేదారును మార్చేందుకు వెనకడుగు వేయవద్దన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, వంతెనలు, గృహాలు, విద్యుత్ అందించి, వారి జీవన ప్రమాణాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏకారణాల చేతనైనా అభివృద్ధి పనులు ఆగితే, వెంటనే తమ దృష్టికి తేవాలని తెలిపారు.

**పథకాల ద్వారా పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి పేదలకు అభ్యున్నతికి తోడ్పడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పథకాలన్నీ సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎట్టి పరిస్థితుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని అన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వెంటనే పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలోని మండలాలలో మంజూరైన ఇండ్లు, నిర్మాణంలో ఉన్న ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ మండలాలలో అటవీశాఖ తో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఉన్న సమాచారాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. వివిధ ఇంజనీరింగ్ ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులకు సంబంధించి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణాలకు అనుమతులు లభించి, పనులు ప్రారంభించినట్లయితే వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్మాణంలో అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించి అటవీ శాఖ పరిధిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని తెలిపారు. మదనపు నిధులు అవసరం ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేసేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. సమావేశ అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలకు సంబంధించి గోడప్రతులను కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, సంబంధిత శాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ నాగినిభాను, ఆర్డిఓ రత్నకళ్యాణి, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## స్విమ్మింగ్‌లో దూసుకుపోతున్న
# కొమ్ము చరణ్ తేజ్

**ఆదిలాబాద్, నవంబర్ 13 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రానికి చెందిన కొమ్ము చరణ్ తేజ్ స్విమ్మింగ్‌లో దూసుకెళ్తున్నాడు. ఇటీవల జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆయన... తాజాగా ఎస్.జీ.ఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు. హైద్రాబాద్‌లోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చరణ్ తేజ్ కాంస్య పతకం సాధించాడు. 400 మీటర్ల ఐ.ఎం విభాగంలో కాంస్యం సాధించి మరోసారి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన చరణ్ తేజ్ ను డిప్యూటీ స్పోర్ట్స్ ఆఫీసర్ జక్కుల శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, సెక్రటరీ రామేశ్వర్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి, ప్రముఖ స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ, ఉపాధ్యక్షుడు లాలా మున్నా, సుంకు చిన్న, కోశాధికారి హరిచరణ్, బారే శ్రీధర్, రాష్ట్రపాల్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరుస్తూ జిల్లా కీర్తిని ఇనుమడింపచేస్తున్న చరణ్ తేజ్ మరిన్ని విజయాలు సాధించాలన్నారు.